
ఓం

అవిఘ్నమస్తు శుభమస్తు

# ఆర్యోక్తి

అను

## "సూక్తిముక్తావళి"



బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు

**శ్రీ మలయాళస్వాముల వారి కృప**
**శ్లోకములకు పద్య తాత్పర్య వివరణ**


రచన :
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.




**ఆర్యోక్తి**


మొదటి ప్రచురణ
సెప్టెంబర్ 2008



రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.



వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109




## ముందుమాట

ఈ మీ చేతుల్లో ఉన్న కృతిపేరు 'ఆర్యోక్తి'' అను "సూక్తిముక్తావళి''. దీనికి పేరు పెట్టటానికి రెండు కారణాలున్నాయి. ఆర్యోక్తి అంటే జ్ఞానులు (పెద్దలు) చెప్పిన మాట. దీంట్లో గల సంస్కృత శ్లోకములకు ఆధారం శ్రీ మళయాళస్వాముల వారు తమ శిష్యులకు 'కంఠస్తం' చేయుమని చెప్పిన అజరామరమైన శ్లోకాలు. స్వాములవారు ప్రసిద్ధములయిన శ్లోకములను తాము చదివిన భగవద్గీత, వేదాంత పంచదశి, వివేక చూడామణి, ఆత్మబోధ వంటి అనేకానేక గ్రంథముల నుండి గ్రహించి తాము తమ రిఫరెన్సు కొరకు వ్రాసికొని భద్రపరచి శిష్యులచే కంఠస్థము చేయించేవారు. తమ ఉపన్యాసములలో ఉదహరించి తాత్పర్యము వివరించేవారు. కనుక ఇదియొక అపురూప సంకలనము. ఇది ఒక "అమృత కలశం". ఒక కరదీపిక.

ఆ శ్లోకాలకు తాత్పర్యం కూర్చి మాతృశ్రీ చోడె



వేంకటరమణమ్మగారు పుస్తకరూపంలో ముద్రించి భక్తజనులకు అందిస్తే ఒకకాపీ నా మిత్రులు "కటకము పురుషోత్తం" గారికి వారి బంధువులు ఒకరిద్వారా వారికి చేరింది. ఆయన నాపైగల అభిమానంచే నాకు చదివి వినిపించటమేగాక, తెలుగు పద్యాల రూపంలో తర్జుమా చేయమని చదువరులకు ఉపయోగకరంగా ఉంటుందని సలహా ఇచ్చారు. మొత్తం 635 శ్లోకాలనుంచి నేనూ వారు కలిసి చదివి ఒక 116 శ్లోకాలను ఎన్నుకున్నాం. వాటికి నేను పద్యరూపం ఇస్తే ఆయన ఆపద్యాలను తప్పులు దిద్ది వాటి అందాన్ని ద్విగుణీకృతం చేశారు. గతంలో నేను పద్యరూపంలో శివానందలహరి మార్చినప్పుడు కూడా దానిని పరిష్కరించి నన్ను ధన్యుణ్ణి చేసింది ఆయనే. ఇదే విధంగా నాకు డా॥ బి.వి.ఎస్.ఆర్.మూర్తిగారు, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్.మూర్తిగారు గతంలో నా ఇతర రచనలలో సహాయం చేశారు. వీరందరి స్నేహం సహాయం నాకు దొరకటం నా గతజన్మ సుకృతమేనని నిస్సందేహంగా చెప్పగలను.

ఆసువుగా నా కలంనుంచి అప్పటికప్పుడు, వచ్చిన ఈ రెండు పద్యాలను చిత్తగించండి.

ఉ॥ మీరిన మోహపాశమున మేలు స్మరించక తాము
జిక్కి, సం
సార జలార్ణవంబు నను జ్ఞానవిహీనులు
దుఃఖభాగులై
కోరుదురందునే సుఖము గూడుగ జూతురు,
'నేతిబీర' లో
వారికి బొట్టునేయియును ప్రాప్తిలునే? సుఖ
మట్లెయౌగదా!

ఆ॥ జాతిలేనివాని జతకాదు నేరంబు
ధనములేని వాని దయయు మేలె
పేరులేనివాని మిత్రత్వమే బాగు
నీతిలేనివాని 'నీడ' తగదు.



నా పద్యాలకి తాత్పర్యం అవసరం లేదు. కానీ పద్యంలో ఇమిడ్చలేక పోయిన భావాన్ని తాత్పర్యంలో ఇమిడ్చటానికి నాకు తాత్పర్యం ఎంతో సాయపడింది.

ఇది చాలగొప్ప ప్రయత్నం అని నేను అనలేను కాని చాల ఉపయోగపడే పుస్తకం అని నిస్సందేహంగా చెప్పగలను. మన ఋషుల ఆలోచనలెలా ఉంటాయో తెలుస్తుంది. మనకు మన తప్పులు తెలుస్తాయి కొన్ని పద్యాలలో స్త్రీని 'కించ' పరిచినట్లు అనిపించినా, ఇక్కడి స్త్రీలు, అందరు స్త్రీల లాంటివారు కారని, మన టి.వి. సీరియల్సులో చూపించే 'పగ' తో రగిలిపోయే పాము బొట్లున్న స్త్రీలని భావించగలరని నా ఆశ.

నా వర్క్స్ అన్నీ మీకు **www.geetadeeksha.com** అనే నా వెబ్‌సైట్‌లో లభిస్తాయి. వాటిని చదివి అన్నీ భగవన్నామ సంకీర్తనలే కాబట్టి మంచి పుణ్యధనం మీ ఖాతాలో జమచేసుకోండి.



నాకు తెలిసిన ఒకమాట చెప్పగలను. పరమాత్మకి పాపులంటే ద్వేషం లేదు. వాళ్ళుకూడా ఆయన బిడ్డలే కదా! ఆయనకి వారు చేసే పాపమంటేనే ద్వేషం. పాపం చేయని వారంటే ఇష్టం. పుణ్యం చేసేవారంటే ప్రేమ, ఆ స్వామికి. ఆ స్వామిని నేను 'శ్రీహరి' అంటాను. ఒకాయన 'అల్లా' అంటాడు. ఇంకొకాయన ''యహోవా'' అంటున్నాడు. అందరూ ఒకడే. దానికి ముందు ఇది వినండి... ఈ నాకృతిని శ్రీ కటకము పురుషోత్తం గారికి భక్తితో అంకితమిస్తున్నాను. ఆయనను భగవంతుడు ఆయురారోగ్యాలలో ఆనందంగా ఉంచుగాక! నాకు తోచిన ఆఖరి సలహాతో దీన్ని ముగిస్తాను.

భగవంతుడికి ప్రేమపాత్రులవాలంటే ముందు సన్మార్గులై తరువాత భక్తులవాలి. ఉత్తిభక్తుడైతే లాభం లేదు. దుర్మార్గం కూడదు. రావణాసురుడికంటే గొప్ప భక్తులం అవగలమా? సన్మార్గం కావాలంటే నీతి ఉండాలి. నీతి కావాలంటే ఇట్లాంటి ఆర్యోక్తులు తెలుసుకోవాలిసిందే. దానికోసం పెద్దలందించిన 'చద్దిమూట' విప్పాల్సిందే. మరి చూస్తారేం? విప్పండి....



# ప్రార్థన

**కం॥ శ్రీవల్లి ప్రాణనాథుని**
**ఆవల తనతండ్రిగారి ఆశీస్సులతో**
**లావుగ గెలిచిన గణపతి**
**నే వినయము తోటి గొలుతు నిటలాక్షుసుతున్**

**చం॥ ధనదుని అప్పు దీర్చుటకు తాను వచించిన**
**బాసనిల్పనై**
**అనితర సాధ్యమైన గతినా హరి వేంకట**
**నాథుడై మహిన్**
**తనువసియించి ఒంటరిగ ధన్యులజేసెను**
**కొంగుపైడియై**
**మనలను, శ్రీనివాసునికి మంగకు మ్రొక్కెద**
**అండనుండగా**

**ఉ॥ బూదిగ మారె భామయని ఉగ్రుడు తానయె**
**వ్యోమకేశుడున్**
**వేదన మ్రింగి హుమ్మనుచు వేణిని బీకుచు**
**నేలగొట్టగా**
**నిర్దయుడొచ్చె తావెలసి నిశ్చలచిత్తుడు**
**వీరభద్రుడున్**
**సాదరమొప్ప మ్రొక్కి తను చంపగ దక్షుని**
**రుద్రుడైచనెన్.**

**శ్లో॥ ఆదిత్యాయ చసోమాయ మంగళాయ బుధాయచ**
**గురుశుక్ర శనైభ్యచ్ఛ రాహవే కేతవే నమః**

**ఉ॥ శైలజ! నీదు స్తన్యములు జాలుడు వారగనీ**
**హృదిన్ అహో!**
**పాలసముద్రమాయనెడి వాఙ్మయధారగ**
**దోచె కానిచో**



**బాలుడొకండు 'ద్రావిడ' ని వాసిలె నీచను**
**బాలు ద్రావుచున్**
**ఏలిక అయ్యె సత్కవుల నెందరినో తను మించె**
**లీలగా**

ఆదిశంకరుల "సౌందర్యలహరి" లోని 75వ శ్లోకం
**"తవస్తన్యం మన్యే ధరణిధరకన్యే...."**
ఆధారం

సీ॥ మధుర స్వనంబును మత్తకోకిలకిచ్చి
వాసినొందగ జేయు వాడెవండు
అమిత సువాసన లందించి మల్లెల
సిరిమల్లె జేసిన శ్రేష్ఠుడెవడు?
మధుపంబులకు నేర్పి మధుకరంబును తీపి
తేనియనిచ్చిన ఘనుడెవండు?
గడ్డి పువ్వును గూడ కంటికింపారగ
చేసినదెవ్వడు వాసిగాంచి



తే॥ ఆ పరాత్పరుండు అంతుతేలనివాడు
ఆదిమధ్యమంత మరయలేని
వాడెవండు జగతి వర్ధిల్ల జేసిన
వాని పొగడనాకు మాట రాదె?

ఉ॥ ఎవ్వడు వాడు? కన్నులకు ఎందుకు తోపడు?
ఎట్లునుండునో
ఎవ్వని బిడ్డయో? అతడు ఏమియొనర్చునొ
తెల్వరాదయెన్
ఎవ్వడు ఇష్టుడాతనికి? ఎవ్వడు శత్రువు?
ఏ నివాసమో?
ఎవ్విధి బిల్తునా విభుని ఈశ్వర అందును ఇంక
ఏమనన్

ఆ॥ విశ్వరూపుడైన విశ్వాత్ముబూజించి
రూపులేనివాడు తోప హృదిని
జన్మధన్యమగును జనన మరణముల
చక్రమందు బడక సంచరింతు



ఉ॥ కట్టెలు రెండు వేగమున కాల్వ ఝరిన్
పయనించి బోవుచున్
పట్టుకునుండి తీరు తమ బంధము శాశ్వత
మన్న ఆ విధిన్
కొట్టుకపోయి యంత తమ కూటమి వీడుచు
వేరు దారులౌ
ఇట్టిదె జీవయాత్ర, మరి ఎందుకు
బంధము నిత్తువీశ్వరా!

సీ॥ సూర్యదేవుని గొల్చె సొంపుగా నొక్కండు
అగ్నిని బూజించెనవని నొకడు
నవగ్రహంబుల గొల్చె నానావిధంబుల
దానంబుల నొసంగె తానొకండు
దశరూపముల హరిదాల్చనొక్కడు మ్రొక్కె
ఆంజనేయుని గొల్చె అతనొకండు
శివపార్వతుల గొల్చె శివనందనుల గొల్చె
పనిగొని నొక్కండు పాముగొల్చె

తే॥ త్రిమత గురువుల నొక్కండు సమత గొలిచె
నేటి మతబోధకుల గొల్చె నిష్టనొకడు
ఇంత జేసియు నరుడిద్ది ఎరుగడయ్యె
ఆత్మరూపుడై పరమాత్మ అమరెననచు

శా॥ ఏ కాకారము నొప్పు ఈశ్వరునికిన్
ఇష్టంబుగా మ్రొక్కెదన్
సాకారంబున పద్మనాభు గొలుతున్
సాధించి ముక్కంటినిన్
నాకిచ్చెన్ పురుషోత్తముండు కృపతో
నాణ్యంబుగా స్ఫూర్తినిన్
మీకీ నీతి శతంబు జెప్పితిని నే
మేలైన సాయంబుతో



## అంకితం

ఆ.వె॥ అవని గుడ్డికెట్లు అన్ని పఠింతురో
అట్లె చదివి చెప్పెనతడు నాకు
పూనినే కటకము పురుషోత్తమునకిది
అంకితమ్మునిత్తు అమిత భక్తి



## ఆర్యోక్తి
## (శ్రీమళయాళ స్వామివారి కృప)

**శ్లో॥ త్వమేవమాతాచపితాత్వమేవ**
**1 త్వమేవ బంధుశ్చసఖాత్వమేవ**
**త్వమేవవిద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమదేవదేవ॥**

ఉ॥ తల్లివి నీవె మాకు, నువెతండ్రివి, బంధువు నీవె,
నీవెమా
ఉల్లము ప్రీతిజేయగల ఉత్తమనెయ్యము, నీవె
విద్యయున్
చల్లనిదైవమీవె, ధనసాధనలన్నియు దేవదేవ!
నీ
వెల్లజగంబులందుగల ఏదియు మాకిక నీవె
ఓ ప్రభూ!



తా॥ ఓ దేవదేవా! మాకు నీవే తల్లివి, తండ్రివి కూడా నీవే, భద్రత కల్పించగల బంధువు నీవే. మా మనస్సులను రంజింప చేయగల మంచి మిత్రుడు కూడా నీవె. మాకు జీవనోపాధి నొసగే విద్యయూ నీవె. చల్లనిదైవం నీవే. మాధన సంపత్తి అంతా నీవే. సమస్త లోకాలలోగల ఏది అయినా నీవే. ఓ ప్రభూ! మాకు అన్నీ నీవే.

**శ్లో॥ కాకః కృష్ణః పికః కృష్ణః కోభేదః పికకాకయో**
**2 వసంత కాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః॥**

ఆ॥ కాకి నలుపు మరియు కోకిల నలుపేను
పికము కాకములకు బేధమేమి?
వినుడు, ధాత్రిపైన వెలయ వసంతంబు
కాకి కాకమేలె పికము పికమె.

తా॥ కాకి కోకిల పిల్లలుగా రెండూ నల్లగా ఒకేలా ఉంటాయి. వసంత కాలం రాగానే మధురంగా కూసే కోయిల కోయిలే. కావు కావుమనే కాకి కాకిలాగానె ఛీత్కరించబడును.

**శ్లో॥ కావ్య శాస్త్ర వినోదేన కాలోగచ్ఛతి ధీమతాం**
**3 వ్యసనేనచ మూర్ఖాణాం నిద్రయా కలహేనవా॥**

తే॥ బుధులు శాస్త్ర, కావ్య విచార బోధలను
కాలమెల్లను ప్రీతితో గడుపుచుంద్రు
మూర్ఖులతి నిదుర, జగడములను చెలగి
కాలమంతయు గడుపుదురిలను పూని.

తా॥ బుద్ధిమంతులు వారి సమయమును కావ్యముల గురించియు, శాస్త్రముల గురించియు చర్చలు జరుపుచు గడుపుదురు. కాని మూర్ఖులు మాత్రం అతినిద్రతోగాని, ఇతరులతో పోట్లాడుతూగాని గడుపుతారు.



**శ్లో॥ క్షణం వాన వృథాకాలంనయేద్యస్తు ధన్యవాన్**
**4 స ఏవసుకృతీ లోకే పూర్ణవైరాగ్య భాగ్యవాన్॥**

ఆ॥ క్షణము వ్యర్థమైన కనుల నీరంబును
ధారవోలె గార్చు ధరణి నెవడు
సుకృతి, ధన్యుడతడు, శోభిల్లు లోకాన
తాన్ విరాగియగుచు తనరుచుండు

తా॥ ఒక్క క్షణ కాలం వృధా అయినా ఈ లోకంలో ఎవరు కన్నీటితో బాదపడతాడో వాడే పుణ్యాత్ముడు మరియు ధన్యాత్ముడు కూడ. ఈ లోకంలో అతను విరాగి వలె శోభించి వర్ధిల్లుతుంటాడు.

**శ్లో॥ తటాకంధన నిక్షేపం బ్రహ్మస్థాప్యం సురాలయం**
**5 ఆరామకృతి (కూపాని) సత్రాణి సప్తసంతాన సంజ్ఞకాః**



సీ॥ చెరువుల ద్రవ్వించ, స్థిర ధనాగారంబు
జేకూర్ప మేళ్ళను చేయుకొఱకు
బ్రహ్మవిష్ణులకెల్ల బసజూప, హితముగా
గుడికట్టి పుణ్యంబు గూర్ప ప్రజకు
పరహితమును కోరి ఫల పుష్పములనీయ
అన్నసత్రంబుల నమర జేయ
ఉత్తమ గ్రంధాలనుపకార చింతతో
అచ్చువేయించుచునందజేయ

తే॥ సప్తసంతానమందురు సజ్జనాళి
ఒక్కసుగుణము జాలును, ఉన్నతమకు
సుతుడు యున్నట్లె ఉత్తమ గతులు గలుగు
చింత యేలరా! ఇకనీకు సంతుకొఱకు

తా॥ సంతానం లేదని వారితోనే సద్గతులు కలుగుతవని అనుకోవటం ఉత్త అవివేకం. ఈలోకంలో ఏడు రకములైన సంతానములు మనిషికి ఉత్తమగతులు



కలిగిస్తాయి. చెరువులను త్రవ్వించుట, సంఘంలో మంచి పనులు జరుగుటకై స్థిరమైన ధనాగారం (ఫండ్) ఏర్పాటు చేయుట, బ్రహ్మనిష్ఠాగరిష్టులకు నివసించు బస ఏర్పాటు చేయుట, దేవాలయాలు పరుల పుణ్యంకోసం నిర్మించుట, పరులమేలు కోరి ఫల పుష్పవనలను ఏర్పాటు చేయుట, అన్నసత్రములను కట్టించుట మరియు పరులకు పుణ్యం రావాలని ఉత్తమమైన గ్రంధములను (వ్రాయుట) అచ్చువేయించుట, పంచిపెట్టుట, అనే ఈ ఏడుగురు పుత్రులు కూడా ఉత్తమగతుల నిస్తారు. ఒక్కసుగుణమున్నా చాలు. పుత్రసంతానం లేదని చింతించాల్సిన పనిలేదు.

**శ్లో॥ ప్రథమం గురుకార్యంచ దైవకార్యం ద్వితీయకం**
**6 తృతీయమపిచాతిథ్యం స్వాత్మకార్యం చతుర్థకమ్॥**

**ఆ॥ మొదట గురువునాజ్ఞ పిదప దేవుని కార్య**
**మదియునైన వెనుక అతిథిపూజ**
**జరిపి తృప్తి జేసి స్వంత కార్యంబుల**
**నాచరించవలెను అవని నరులు.**

తా॥ మానవుడు మొట్టమొదటిగా తన గురువుగారి ఆజ్ఞను పాటించవలెను. ఆ తరువాత దైవకార్యము నెరవేర్చవలెను. తదుపరి అతిథి అభ్యాగతుల నాదరించి తృప్తి పరచవలెను. ఇవి అన్నియూ అయిన తరువాత మాత్రమే తన స్వంత పని చేసుకొనవలెను.

**శ్లో॥ హంస శ్శుక్లో బకశ్శుక్లః కోభేదః బకహంసయోః**
**7 నీరక్షీర విభాగేతు హంసో హంసః బకో బకః ॥**

ఆ॥ హంస తెలుపు, కొంగ అదియును తెలుపేను
విదిత పరచి చూడ భేదమేమి?
క్షీర నీరములను వేరు చేయుట యందు
హంస ప్రతిభ జూపునణగు కొంగ



తా॥ హంస యొక్క రంగు తెలుపు. కొంగ కూడా తెలుపు రంగులోనే వుంటుంది. మరి ఈ రెండిటికీ తేడా ఏమిటి? పాలు నీళ్ళు కలిసియున్నప్పుడు తన ప్రతిభతో కేవలం హంస మాత్రమే ఆ పాలనూ నీటినీ వేరు చేయగలదు. కొంగ అట్లు చేయలేదు.

**శ్లో॥ వైరాగ్యతైల సంపూర్ణే భక్తివర్తి సమన్వితే**
**8 ప్రబోధ పూర్ణ పాత్రేతు జ్ఞప్తి దీపం విలోకయేత్॥**

ఆ॥ 'ఆత్మచింత' ప్రమిద యందు వైరాగ్యంబు
అనెడి 'చమురు' పోసి, అమల భక్తి
అనెడి 'వత్తి' వేసి అద్వైత జ్యోతిని
వెలుగు జిమ్మునట్లు నిలుపవలెను.

తా॥ ఆత్మజ్ఞాన మనెడి ప్రమిదలో వైరాగ్యమనెడి నూనెను పోసి, నిర్మలమైన భక్తియనెడి 'వత్తి' వేసి అద్వైత జ్ఞానమనెడి జ్యోతిని వెలుగులు ప్రసరించునట్లు వెలిగించవలెను.



**శ్లో॥ జన్మనా జాయతే జంతుః సంస్కారాద్విజ ఉచ్యతే**
**9 వేదపారాయణో విప్రో బ్రహ్మజ్ఞానేతు బ్రాహ్మణః**

ఆ॥ జన్మచేత నరుడు జంతువే, ద్విజుడౌను
సలిపి వడుగు తండ్రి సంస్కరించ
వేదవిద్యనేర్చి విప్రుడౌ, ఆపైన
బ్రహ్మజ్ఞాన మరయ బ్రాహ్మణుండు

తా॥ మానవుడు తన జన్మచేత జంతువు మాత్రమే. వానికి తండ్రి వడుగు చేసినంత ద్వితీయ జన్మనొందినవాడై ద్విజుడౌతాడు. వేదం నేర్చుకొనిన అనంతరం విప్రుడవుతాడు. అతడు బ్రహ్మజ్ఞానం తెలుసుకొనిన అనంతరమే బ్రాహ్మణుడవుతాడు. అంతేకానీ పుట్టుకతో బ్రాహ్మణుడెవరూకారు.

**శ్లో॥ తపోవిద్యాచ విప్రస్య నిశ్శ్రేయ సకరంపరమ్**
**10 తపసా కిల్బిషం హన్తివిద్యయా2 మృతమశ్నుతే॥**



ఆ॥ గాలి అగ్నులందు కాలిన స్వర్ణంబు
చిలుము పోయి వెలుగు జిమ్ము, అటులె
తపము, బ్రహ్మవిద్య ధన్యుజేయును నరున్
కల్మషములు వోయి కలుగుముక్తి.

తా॥ బంగారము గాలితో కలిసిన అగ్నితో కాలినపుడు దానికి పట్టిన చిలుము పోయి కాంతులు విరజిమ్ముతుంది. అదే విధంగా నరులను తపస్సు మరియు బ్రహ్మ విద్య కల్మషము పోవునట్లు జేసి ధన్యులను జేయును. ముక్తి నొసంగును.

**శ్లో॥ మితనిద్రా మితా హరో మిత వస్త్ర పరిగ్రహః**
**11 మిత భాషణమేకైకం భూషణం బ్రహ్మచారిణామ్.**

ఆ॥ మిత నిదురయు, తిండి మితమట్లెవస్త్రంబు
మితిగ, భాషణంబు మేలు జేయు
బ్రహ్మచారి కౌను వరభూషణములవి
సర్వశ్రేష్ఠమైన సాధనములు.

తా॥ మితి కలిగిన నిద్ర, మితిగల ఆహారము పరిమితిగల వస్త్రధారణ (ఆడంబరములేని వస్త్రధారణ), మితముగ మాట్లాడుట నరులకు మేలు జేస్తాయి. ఇవి బ్రహ్మచారికి ఆభరణములవంటివి. సర్వశ్రేష్టమైన సాధనములు అవియే.

**శ్లో॥ స్నానేచ భోజనే హోమే జపే మౌనము పాశ్రయేత్**
**12 అల్పాక్షర మనంతార్థం వాక్యం బ్రూహి మహామతే॥**

ఆ॥ తానమాడునపుడు తను భుజించెడివేళ
నిల్చిహోమమొందు వ్రేల్చువేళ
జపము జేయువేళ సంభాషణపు మితి
మౌనమైన మేలు జ్ఞానులనిరి

తా॥ స్నానము జేయునపుడు, భోజనం చేస్తున్నపుడు, హోమము వ్రేల్చు సమయమున, జపము జేయునప్పుడు మిత సంభాషణముగాని మౌనముగాని మేలు అని జ్ఞానులందురు.



**శ్లో॥ అవశ్యం భావి భావానాం ప్రతీకారో భవేద్యతి**
**13 తధా దుఃఖైర్నలి ప్యేరన్ నలరామయుధిష్ఠిరాః॥**

చం॥ తెలియరె! ఆ విధిన్ గెలిచి దీటుగ కట్టడి జేయ గల్గువా
డిలనొకడైన లేడుగద! నెంచగ యోచన జేసి, కానిచో
నలునికి, రామచంద్రునికి, న్యాయము నేర్చిన ధర్మరాజుకున్
పలుకడగండ్ల కాననని వాసము దేనికి నేర మున్నదే?

తా॥ ప్రారబ్ధ కర్మ అనబడే విధిని యెదిరించి గెలుచుటకు ఎవరికీ సాధ్యం కాదు. ఒక్కడైనా వెతికి చూద్దామంటే ఆపని జేసినవాడులేడు. చక్రవర్తులలో శ్రేష్ఠులైన నలమహారాజు గాని, శ్రీరామచంద్రుడుగాని, న్యాయం బాగుగా తెలిసిన ధర్మరాజు గాని విధికి తలవంచేకదా అడవుల్లో గడిపారు. వారినేరం ఏముందని?



**శ్లో॥ వేధాద్వేధా భ్రమం చక్రే కాంతాసుకనకేషుచ**
**14 తాసుదేష్వ ప్యసక్తోహినరోనారాయణో భవేత్॥**

ఆ॥ కాంత కాంచనముల ఘనమైన మోహంబు
నలువ సృష్టితోనె నరులకిచ్చె
నరుడుముక్తుడైన నారాయణుండగు
వాటియందు భ్రాంతి వదల వలెను

తా॥ బ్రహ్మదేవుడు సృష్టి చేస్తూనే మనుష్యులకు స్త్రీయందును బంగారముపై నను వ్యామోహము నేర్పరచెను. వాటియందు భ్రాంతిని విసర్జించిన నరుడు ముక్తిపొంది నారాయణుడే అవుచున్నాడు.

**శ్లో॥ ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణం**
**15 విరక్తస్య తృణం భార్యా నిస్పృహస్య తృణం జగత్॥**



చం॥ తను తృణమట్లు విత్తమును తల్చును దారుడు ధర్మచింతతో
వెనుకడుగేయబోడు 'అని' వీరుడు మృత్యువె గడ్డిపోచయౌ
తనసతి భోగమున్ కనడు తాను విరక్తుడు, అట్లె ఈ జగం
బును తృణమట్లు యెంచు తను బూనుచు సంగము వీడుయోగియున్

తా॥ ఉదారుడైన వాడు ధనమును గడ్డిపోచవలె భావించి ధర్మ చింతనతో ఉంటాడు. వీరుడు తన మృత్యువునే గడ్డి పోచగానెంచి యుద్ధంలో వెనకడుగేయడు. విరక్తుడైనవాడు స్త్రీ సంభోగమును కాంక్షించడు. అదే విధముగా ఈ జగత్తును తృణప్రాయముగా నెంచి యోగియైనవాడు సంగత్వమునే వీడును.

**శ్లో॥ కాకదృష్టిర్బకధ్యానం శ్వాననిద్రా తథైవచ**
**16 అల్పాహారో జీర్ణవస్త్రం ఏతద్విద్యార్థి లక్షణమ్॥**

ఆ॥ కాకియొక్క దృష్టి, బకపు ధ్యానంబును,
కుక్క నిదుర, ధరలు తక్కువయిన
బట్టకట్టవలెను, పరిమితాహారంబు
విద్యనేర్చునట్టి విధములవియె

తా॥ విద్యను శ్రద్ధగా నేర్వదలచిన విద్యార్థికి, కాకికుండే దృష్టి (తనరెండు వైపులా చూసుకుంటుంది) కొంగ ధ్యానము (ఒంటి కాలిపై నిలుచుని మరీ ధ్యానిస్తుంది), ధరస్వల్పమైన బట్ట, పరిమితమైన తిండి మాత్రమే తినుట, ఆదర్శ విద్యార్థియొక్క లక్షణములు.



**శ్లో॥ యథాచ మలినే వస్త్రే రంగః శుభ్రతరో నహి**
**17 క్షాళనే హి కృతేశుద్ధే సర్వోరంగః ప్రసజ్జతే॥**

ఆ॥ మురికి వస్త్రమునకు ఏ రంగు అతకదు
తడిపినంత నీట తరలిపోవు
బట్టఉతికి వేయపట్టుయే రంగైన
మనసు శుద్ధిజేత బ్రహ్మనెరుగు

తా॥ ఏ వస్త్రమునకైన రంగు అతకాలంటే దానికి మురికి ఉండరాదు. ఒకవేళ రంగు వేసినా ఆ బట్టను తడిపి ఉతకంగానే రంగు పోతుంది. అదే ఆ వస్త్రమును పరిశుభ్రంగా ఉతికి మురికి పోయేట్లుజేసి రంగు వేస్తె ఆ రంగు బాగా అంటుకుంటుంది. అట్లే నరుని మనస్సు పరిశుద్ధం చేసికొంటే (అప్పుడు తపస్సు జేస్తే) బ్రహ్మ (జ్ఞానము) తెలియును.



**శ్లో॥ అభేద దర్శనం జ్ఞానం ధ్యానం నిర్విషయం మనః**
**18 స్నానం మనోమత్యాగః శౌచమింద్రియ నిగ్రహః ॥**

ఆ॥ బేధ రహిత స్థితియె వెలయుట జ్ఞానంబు
నిర్విషయమె ధ్యాన నిష్ఠయంద్రు
రాగద్వేషమలము పోగొట్టు స్నానంబు
శౌచమింద్రియముల శమనముంట

తా॥ కొందరు పెద్దపెద్ద వేదాంత విషయాలు మాట్లాడుతూ తమకే సరిగా తెలియని మాటలు వాడి అయోమయంలో పడేస్తారు. నిజానికి ఆ మాటల అర్థం అంత కష్టంకాదు. అన్నిటికంటే విలువయిన 'జ్ఞానం' అంటే 'బేధృష్ట' లేకపోవటం. ధ్యానం అంటే విషయములపై దృష్టి లేక పోవుట. స్నానం అంటే నీళ్ళు పోసుకోవటం కాదు. రాగ ద్వేషాల వంటి మలినాలు పోగొట్టుకోవటం ఇక, శౌచమంటే ఇంద్రియాలను శమనపరచి నిగ్రహంతో నుండుట.



**శ్లో॥ ఉత్తమా తత్త్వచింతైవ మధ్యమం శాస్త్ర చింతనం**
**19 అధమామంత్రచింతాచ తీర్థభ్రాంత్యధమాధమా॥**

ఆ॥ తత్త్వ చింతనంబు ధాత్రినుత్తమంబు
మధ్యమంబు శాస్త్ర మహిమ నెరుగ
అధమమౌను మంత్ర మధమాధమంబురా
తీర్థయాత్ర భ్రాంతి తెలిసి చూడ

తా॥ తత్త్వ చింతన ఉత్తమమైన జ్ఞానసముపార్జన. శాస్త్రజ్ఞానము మధ్యమమైనది. మంత్రశాస్త్ర జ్ఞానం అధమమైనది. అయితే తెలిసికొంటే సత్యమేమంటే తీర్థయాత్రలు చేసి జ్ఞానం మోక్షం పొందాలనుకోవటం అది ఎంత భ్రాంతి!

**శ్లో॥ త్వక్త్వమాగత్య దుఃఖాయస్పర్శోన్ముఖతయాతయా**
**20 మూర్ఖమాబద్ధ్యతా మేహీ గజీలుబ్ధ గజేంద్రవత్॥**

ఆ॥ స్పర్శ సుఖము కొఱకు సంబంధముల నొంది
ముక్తి పొందలేవు మూఢ మనస!
'గజి'కి లొంగి జిక్కు గజరాజు కైవడి
బంధమందు కట్టుబడకు, తగదు.

తా॥ ఓ మూఢ మానసమా! స్పర్శ సుఖం అంతులేని దుఃఖాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే ముందు సుఖానుభూతి కలుగుట చేత దానికొరకు ఏవేవో సంబంధాలు పెట్టుకొని ఆ బంధాలనుంచి విముక్తి పొందలేక దుఃఖిస్తావు. మగ ఏనుగులను పట్టుకొని బంధించటానికి వేటగాళ్ళు పెద్ద గొయ్యి తవ్వి దానిదగ్గిర ఒక (గజి) ఆడ ఏనుగును కట్టేసి, దానికోసం ఆత్రంగా వచ్చే మగ ఏనుగు ఆ గోతి పడేట్లు చేస్తారు. మనుష్యులలో కూడ అదే విధంగా జరుగుతున్నది.



**శ్లో॥ క్షుర ధారా సుసం లగ్నం యధా స్వాదయతే మధు**
**21 సుఖం స్వల్పం మహద్దుఖం సంసారే2 స్మిన్ తథా సుఖం॥**

తే॥ చూడ సంసార సుఖము సుఖమదెంత?
దుఃఖమధికము వెలువడతోపదాయె
తేనె జొనుపు మంగలికత్తి తీపి యెంత?
నాల్కతెగిపోదె చివరలు నాకినంత

తా॥ మానవుడు సంసార సుఖం అనుకునే ఆ సుఖంలో సుఖం యెంతుంటుంది? దుఃఖమే ఎక్కువగా ఉంటుంది. పైగా ఆ దుఃఖం నుంచి బయటపడడం కూడ సాధ్యంకాదు. మంగలి కత్తిని తేనెలో ముంచి నాకితే తియ్యగా ఉంటుందా? ఉన్నా యెంతసేపు ఉంటుంది. నాలుక తెగిపోదా?



**22 శ్లో॥**
**పరోపకారాయ ఫలన్తి వృక్షాః పరోపకారాయ వహన్తి నద్యః**
**పరోపకారాయ చరన్తి గానః పరోపకారార్ధమిదం శరీరం॥**

చం॥ పరుల హితంబు కోరుచును పాదప మీభువి పండ్ల నిచ్చెతాన్
పరులకు మేలు సల్పుటకు నదంబులు జేరు సాగరున్
పరులు తమందరున్ బ్రతుక పాడినొసంగును ఆల మందలున్
పరులకు మంచి చేయుటకు మాత్రమె మానవ కాయమొచ్చెరా

తా॥ ఈ ప్రపంచంలో ఇతరులకు మేలు చేయుటకొరకే చెట్లు, పండ్లును, పూలను ఇస్తున్నాయి. నదులు పారుతూ సముద్రంలో కలుస్తున్నాయి, ఆవులమందలు పాడినిస్తూ మేలు చేస్తున్నాయి. పరులకు మంచి చేయుకొరకే ఈ మానవ శరీరం లభించింది.



**శ్లో॥ దాసోహమితియా బుద్ధిః పూర్వమాసీజ్జనార్ధనే**
**23 దాకారో2పహృతస్తేన గోపీవస్త్రాప హారిణా॥**

ఆ॥ వస్త్ర హీనలయ్యు వనమాలి! దాసోహ
మంచుగొలుచు గొల్ల అతివలకు, "న
జ్ఞాన హీన" లవగ బూని "సోహం" బంచు
మోక్షమిచ్చి బ్రోచె 'మురహరంత'

తా॥ ఆహారం జీవించుటకు, వస్త్రం మర్యాదకు, గృహం నివసించుటకు ఈ మూడు చాలా అవసరం. కాని వస్త్రం స్వాభిమానం పెంచుతుంది. స్వాభిమానం ఉన్నంతవరకు పరమాత్మను పొందటం అసాధ్యం. ఆయనకు ఎవరిమీద దయ గలిగితే వారి స్వాభిమానాన్ని నిర్మూలించి అజ్ఞానమంతమొందించి

'సోహం' (నీవేనేను) అనే భావం కలిగించి మోక్షం ప్రసాదిస్తాడు. వనమాలి యైన శ్రీకృష్ణుడు చీరలెత్తికెళ్ళాడని భావించే మూర్ఖులగురించి మాట్లాడకపోవుటే మంచిది. దాసోహం (నీదాసులం) అన్నవారినే సోహం(నీవెనేను) అంటాడాయన.

**శ్లో॥ ఫలస్య కారణం పుష్పం ఫలం పుష్ప వివర్జితం**
**24 జ్ఞానస్యకారణం కర్మ జ్ఞానం కర్మవివర్జితమ్॥**

ఆ॥ ఫలము బుట్టు పుష్పముల కారణంబున
ఫలముచేతపూవు వదలబడియె
కలుగ జ్ఞానమిలను కర్మ కారణమయ్యు
కర్మతొలగు జ్ఞానగరిమచేత



తా॥ ఈ ప్రపంచంలో ఏ పండయనా పుష్పంనుంచే పుడుతుంది. పుష్పరూపం నశించిన తరువాత మాత్రమే పండురూపం వస్తుంది. అదే విధంగా కర్మ చేయుట వలన మాత్రమే జ్ఞానం వస్తుంది. పండువంటి జ్ఞానానికి కారణం పూవువంటి కర్మ అయినప్పటికీ జ్ఞానం రాగానే కర్మ త్యజించబడుతున్నది.

**శ్లో॥ విద్యయాచ యయా విద్యాప్రభయాచయధా తమః**
**25 నశ్యతి బ్రహ్మవిద్యాసా తేజోరూపాచ నేతరా॥**

ఆ॥ విద్య దేనిచే నవిద్య నశించునో
అదియె విద్య, తిమిరమంత తొలగి
జ్ఞానతేజమేది మనసుల నింపునో
బ్రహ్మ విద్య అదియె పరమ సుఖము



తా॥ విద్య అంటే M.Tech కాదు. అవిద్య (అజ్ఞానం) దేనిచేత నశిస్తుందో అదేవిద్య. శాశ్వతమైనదేదో అశాశ్వతమైనదేదో తెలుసుకోలేకపోవటం అవిద్య. అవిద్య పెను చీకటి వంటిది. ఆ చీకటి నిర్మూలింపబడాలంటే జ్ఞాన జ్యోతి అవసరం. ఆ జ్ఞానజ్యోతి మనస్సులో నింపగలిగినదే బ్రహ్మవిద్య. అదే పరమసుఖం ఈయగలదు.

**శ్లో॥ అయం బన్ధురయంనేతి గణనాలఘుచేతసాం**
**26 ఉదారచరితానాన్తు వసుధైవ కుటుంబకమ్॥**

తే॥ వీడు నావాడు, వీడు నావాడు కాదు
అనుట అల్పులకున్ తగు అవనియందు
ఆ ఉదార చరిత్రులు అందరికిని
వసుధ ఒక కుటుంబము రీతి వరలు చుండు



తా॥ కేవలం తక్కువ బుద్ధికల అల్పులు మాత్రమే ఈ ప్రపంచంలో, వీడు నావాడు వీడు పరాయివాడు అనే ఆలోచనలతో ఉంటారు. ఉదార బుద్ధిగల అందరికీ ఈ ప్రపంచమంతా ఒకే కుటుంబంలా తోస్తుంది. అందరినీ తనవారిలా అభిమానిస్తూ ఎవరినీ ద్వేషించరు.

**శ్లో॥ నగచ్ఛతి వినాపానం వ్యాధిరౌషధ శబ్దతః**
**27 వినా2పరోక్షానుభవం బ్రహ్మ శబ్దైర్నముచ్యతే॥**

ఆ॥ ఔషధంబు పేరుననుచు గైకొనకున్న
రోగమెట్లు తగ్గు లోకమందు
నియమనిష్టలేక నెరప బ్రహ్మధ్యాన
మెట్లు? జగతి ధ్యాస యెటుల బోవు

తా॥ వ్యాధి కలిగినప్పుడు మంచి వైద్యుని సంప్రదించి తగిన ఔషధం తగిన రీతిని సేవించాలి. అప్పుడే ఆ రోగం తగ్గుతుంది. కేవలం ఆ ఔషధం పేరు నోటితో పలికి ఔషధం తీసుకోకుండా యుంటే తగ్గదుకదా!

అట్లాగే నియమ నిష్ఠలు లేకుండా బ్రహ్మ ధ్యానమెట్లు చేయగలరు? ఈ ప్రపంచపు ధ్యాస ఎట్లా నశిస్తుంది?

**28 శ్లో॥**

**ఆయుర్వర్ష శతం నృణాం పరిమితం రాత్రే తదర్ధం గతమ్**
**తస్యార్ధస్య పరస్య చార్ధమపరం బాలత్వ వృద్ధత్వయోః**
**శేషం వ్యాధి వియోగ దుఃఖ సహితం సేవాదిభిర్నీయతే**
**జీవే వారితరంగ చంచలతరే సౌఖ్యంకుతః ప్రాణినామ్॥**

సీ॥ నిండు నూరేళ్ళు నీకుండు ఆయువనంచు
విర్రవీగుట ఎంత వెర్రి! నరుడ
సగము రేయినిబోవు చక్కగా నిద్రించ
బాల్యంబులో నేర్వ వశమె కాదు
వృద్ధాప్యమందున పెనురోగముల క్రుంగు
తెలిసియు తరుగును కాలమపుడు
నలిగి వియోగాగ్ని కాలంబు తరుగును
కడగండ్లు గడచును కాలమంత



ఆ॥ ప్రాణికోటికింక బడయంగ సుఖమేది
చంచలంబు జీవ చరణమంత
లాభమేమి? సుఖము రవ్వంత లేదురా
వంద ఏళ్ళు బ్రతుకు ఎందుకింక?

తా॥ ఓ వెర్రిబాగుల మానవుడా! నిండా నూరేళ్ళు బ్రతకాలని యెందుకు తాపత్రయ పడెదవు? నిండా నూరేళ్ళు జీవించినా లాభమేంటి? నీ ఆయుర్దాయంలో సగం నిద్రించుటకు పోయింది. బాల్యంలో చదువు సంధ్యలతోను ఆటపాటలతోను (ఆ సగంలో సగ భాగం) పోయింది. వృద్ధాప్యంలో రోగంతో ఆ మిగిలిన దాంట్లో సగం పోయింది. అప్పుడు కాలం వృధా అవుతున్నదని తెలిసినా లాభంలేదు కదా! ఇక ఆ మిగిలిన కాస్త వియోగ (తనవారు తనని వదలిపోవు దుఃఖం) దుఃఖంలో గడచిపోతుంది. ఇక ఈ ప్రాణి, కోటికి సుఖం ఎక్కడిది? జీవిత గమనమంతా బహు చంచలమైనదే



కదా! ఇందు రవ్వంత సుఖమైనా లేదు. మరి ఇక నూరేళ్ళు బ్రతికి ఏం సాధిస్తావు? (సాధించే వాడివయితే ఎంత తక్కువ ఆయువైనా సాధించవచ్చు)

**శ్లో॥ అగ్ని దగ్ధంయధా బీజం శాఖాపల్లవ వర్జితం**
**29 జ్ఞానదగ్ధం తథాయోగీ పునర్జన్మనవిద్యతే॥**

ఆ॥ అగ్నిలోన దగ్ధమైన విత్తనములు
మొలకలెత్తలేవు ఇలను ఎపుడు
జ్ఞానమందు దగ్ధమైన కర్మల వలన
పుడమి యోగి జన్మపొందబోడు

తా॥ నిప్పు సెగలో వేడి చేసిన విత్తనాలు వాటిలోని జీవశక్తి నశించి ఎన్నటికీ మొలకలెత్తవు. చూడటానికి విత్తనంలా ఉన్నా ఇంకొక చెట్టు



మొలవదు. మనం చేసే కర్మలన్నీ జ్ఞానమనే అగ్నిలో దహింపబడితే ఆ జ్ఞానం సంపాదించిన యోగి తిరిగి పుట్టడు.

**శ్లో॥ పరస్య నిందా పైశున్యం ధిక్కారం కరోతియః**
**30 తత్కృతం పాతకం ప్రాప్య స్వపుణ్యం ప్రదదాతి సః**

చం॥ పరులను నిందజేయుటయు పాయక కొండెము
లన్ని బూనుచున్
విరివిగ జెప్పుచున్ పనిగ వీడుచు సభ్యత వారి
మానమున్
పరువును మంటగల్పెదరు వారల పాపము తాము
పొందుచున్
దొరికిన తొల్లి పుణ్యముల దొంతర తగ్గిన పాపు
లౌదురున్

తా॥ కొంతమంది అవివేకులు, అకారణంగా పరులను తిడుతూ వారిపై పితూరీలు జేస్తూ సభ్యత లేకుండా వాళ్ళ పరువు మర్యాదలు మంటగలుపుతూ గేలిచేస్తూ ఉంటారు. వాళ్ళేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటారు. గానీ వాళ్ళు తాము సంపాదించిన పూర్వ పుణ్యం పోగొట్టుకొని తామెవరిని నిందిస్తున్నారో వారి పాపమునంతా మూటగట్టుకొని తమతో తీసుకెళ్తున్నామని తెలియకున్నారు.

**శ్లో॥ సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్**
**31 నబ్రూయాత్ సత్యమప్రియమ్**
**ప్రియంచ నానృతం బ్రూయాత్**
**ఏషధర్మస్సనాతనః॥**



ఉ॥ నిక్కము జెప్పగావలయు నీమముతో ప్రియ భాషణంబులన్
చక్కగ జేయుమేలగును, సత్యము అప్రియమైన వీడుటే
తక్కువగాని ధర్మమగు తథ్యము, ప్రీతినొసంగు కల్లలన్
ఎక్కడ జెప్పరాదిదియె యీ జగమందున నాది సూక్తియౌ

తా॥ ఎప్పుడూ సత్యం మాట్లాడవలెను. కానీ ఆ చెప్పెడి నిజం ఇతరులకు సంతోషం కలిగించేదయితే తప్పక చెప్పాలి. అప్రియమైన విషయం సత్యమైనా చెప్పకుండుటే మంచిది. అదే విధంగా అసత్యమైతే అది ప్రియం కలిగించేదయినా చెప్పరాదు. ఇదే ఈ ప్రపంచంలో అనాదిగా పాటింపబడుతున్న ధర్మం.



**శ్లో॥ అళీనళీ వృశ్చిక వేణురంభా వినాశకాలే**
**32 ఫలముద్భవంతి**
**యథాతథా సజ్జన దుర్జనానాం వినాశకాలే**
**విపరీత బుద్ధిః**

చం॥ తము విపరీత వృద్ధియును తప్పుడు బుద్దినశింతురే అహో!
భ్రమరములున్ నళిన్, అరటి పాదులు, తేళ్ళును వేణులీభువిన్
సుమనులు దుష్టులై చెలగి సుంతవివక్షత గాంచరున్ అదే
తమకు వినాశకాలము సదా విపరీతపు బుద్ధి నొందరే

తా॥ ఆహో! తమకు పుట్టిన తప్పుడు బుద్ధిచేత, విపరీతమైన బుద్ధిచేత తుమ్మెదలు పద్మములలో ఇరుక్కుపోయి అరటిచెట్లు అడ్డగోలుగా పెరిగి, తేళ్ళు అనవసరంగా ఇతరులను కుట్టి, వెదురు చెట్లు విపరీతంగా పెరిగి సజ్జనులు దుర్జనులతో కొంచెంకూడా వివేకం లేక సహవాసం చేసి నశింఇచపోవుట జరుగుచున్నది. వినాశకాలమున విపరీత బుద్ధులు పుడుతుంటాయి.



**33 శ్లో॥**
**ఉత్తమం మానసం జాప్య ముపాంశుర్మధ్యమం స్మృతం**
**అధమం వాచికం ప్రాహుస్సర్వమన్త్రేషు వైద్విజాః॥**

ఆ॥ మనసునందు జపము మంచిది శ్రేష్టంబు
మహి 'యుపాంశు' జపము మధ్యమంబు
వాచికమున జపము పసలేక అధమమౌ
అన్ని మంత్రములకు అదియె విధము

తా॥ ఎవరికైనా తమ మనస్సులో మౌనంగా జపం చేసుకొనుట ఉత్తమము. ఉపాంశు జపము (ధ్వని

రాకుండా పెదవులు కదిలిస్తూ జపం చేసుకొనుట) మధ్యమము. శబ్దములు పలుకుతూ జపం చేయుట అధమము. ప్రపంచంలో ఉండే అన్ని మతాలకు ఈ విధానం వర్తిస్తుంది.

**శ్లో॥ ఏషాంనవిద్యా న తపోనదానం**
**34 జ్ఞానం నశీలం నగుణో నధర్మః**
**తేమర్త్యలోకే భువిభారభూతాః**
**మనుష్యరూపేణ మృగాశ్చరంతి॥**

చం॥ ఎవనికి విద్యయున్, తపము, ఈవియు, జ్ఞానము, శాంతశీలముల్
అవని నరోత్తముల్ పొగడునట్టి గుణంబులు, ధర్మబుద్ధియున్
అవిరళరీతిలేవొ, భువినైనను నాకమునైన వానికిన్
చివరకు దుఃఖమే మిగులు, జీవితమౌ పశుప్రాయ మట్లుగా



తా॥ ఎవ్వరికైతే విద్య, తపస్సు, దానగుణము, జ్ఞానము, శాంత గుణము, శీలము, శ్రేష్ఠులు పొగడు గుణములు లేవో అట్టివాడు భూలోకంలోగాని స్వర్గంలో గాని సుఖం పొందలేడు. జీవితం పశువులాగడిపి చివరకు అంతులేని దుఃఖం పొందుతాడు.

**శ్లో॥ ఆశాయేయే దాసాస్తే దాసాస్సర్వ లోకస్య**
**35 ఆశాదాసీ యేషాం తేషాం దాసాయతే లోకః**

ఉ॥
ఆశకు దాసుడైన నరుడందరి దాసుల బానిసౌనురా
ఆశకు జిక్కి నీచుడగు ఔను నికృష్ఠుడు లోకమంతకున్
ఆశయె దాసియెవ్వనికి ఆతడు శ్రేష్టుడు విశ్వమంతకున్
పాశమునందు కట్టువడు బానిసలందరికాతడేలికౌ



తా॥ ఆశ అనునది ఒక పాశం లాంటిది. దానికి దాసుడైన మానవుడు దాసులందరికీ బానిసత్వం చేసే అధోగతికి దిగజారతాడు. వాడు నీచుడు నికృష్టుడు కూడ అవుతాడు. కాని ఆశకు దాసి యెవ్వడు కాడో వాడు మాత్రం ప్రపంచంలోకెల్ల శ్రేష్టుడై పాశబద్ధులైన బానిసలందరికి ఏలిక అవుతాడు.

**శ్లో॥ న సుఖం హి సురేంద్రస్యనసుఖం చక్రవర్తినాం**
**36 యత్సుఖం వీతరాగస్యమునే రేకాంత వాసినః**

తే॥ విషయ నిస్సంగు, దేకాంత ప్రియుడు తాను
పొందు సుఖమును కనలేరు పొందలేరు
దివిజపతియైన భువినేలు దిట్టయైన
బ్రహ్మసుఖమును మించిన పదవి కలదె!



తా॥ ఏకాంతమునందు ప్రీతికలవాడు విషయ వాంఛల నన్నింటినీ విసర్జించి యోగివలె సుఖము పొందుతాడు. ఆ సుఖాన్ని దేవేంద్రుడైనా చక్రవర్తులైనా పొందలేరు. దానినే బ్రహ్మానందం అంటారు. దానిని మించిన ఏపదవి కానీ ఐశ్వర్యము కానీ లేవు.

**శ్లో॥ మాతేవ రక్షతి పితేవహితే నియుంక్తే**
**37 కాంతే వచాభిరమయత్యపనీయ భేదం**
**కీర్తించదిక్షువితనోతి తనోతి లక్ష్మీం**
**కింకిం వసాధయతి కల్పలతేవ విద్యా॥**

చం॥ జననిగ రక్షజేయు నది చల్లగ, తండ్రిగ ధర్మ వర్తనన్
గొనకొని నేర్పుతాను, యొనగూర్చును శాంతిని తా పతివ్రతై

తను వెలయించు కీర్తి పలుతావుల దిక్కుల
లక్ష్మినీయురా
వినుమిక ఏదికాదు? యొక విద్యజతైనను
కల్పవృక్షమై

తా॥ దేవలోకంలో కల్పవృక్షముంటుంది. అది కోరుకున్న కోరికల నన్నీ తీరుస్తుందని పెద్దలంటారు. భూలోకంలో అలాంటి కల్పవృక్షం విద్య అని ఆర్యోక్తి. విద్య తోడుగా ఉంటే కోరుకున్నవన్నీ సమకూరుతాయి. ఆ విద్య నరునికి తల్లివంటిది, రక్షణనిస్తుంది. తండ్రివలె ధర్మమార్గంలో నడుపుతుంది. శాంతి సౌఖ్యాలనిస్తుంది. పతివ్రత భర్తననుసరించినట్లు వెంట ఉంటుంది. ఎన్నోచోట్ల కీర్తిప్రతిష్ఠలనిస్తుంది. సంపదనిస్తుంది. అది ఉంటే ఏది సాధ్యంకాదు? అన్నీ సాధ్యమే.



**శ్లో॥ నారాయణేతియస్యాస్తేవదనే నామమంగళమ్**
**38 నారాయణ స్తమన్వేతివత్సంగౌరివ వత్సల**

ఆ॥ హరుడు జెప్పెదానె ఆషణ్ముఖుని తోటి
హరికి భక్తులనిన అమితప్రీతి
భక్తుననుసరించు భగవంతుడెప్పుడున్
దూడకయిన ఆవుతోడువోలె

తా॥ తనకుమారుడైన షణ్ముఖునితో శంకరుడీవిధంగా చెప్పాడు. ఆ శ్రీమన్నారాయణునికి భక్తులంటే అపరిమితమైన ప్రేమ. ఏవిధంగా తనదూడని అనుసరిస్తూ గోమాత కాపాడుతూ వెంట పోతుంటుందో, అదేవిధంగా ఆ భగవంతుడు తన భక్తులను అనుక్షణం అనుసరించే ఉంటాడు.

**శ్లో॥ మర్త్యోహమితి సన్ధాయ మ్రియతేజాయతే చసః**
**39 బ్రహ్మోహమితి సన్ధాయ ముచ్యతేనచజాయతే॥**



ఉ॥ నేనొక మర్త్యుడన్ అనుచునెమ్మది తల్చెడి
మూఢుడెన్నడున్
కానడు ముక్తి బంధముల గట్టు వడంగ
విముక్తిలేక అ
జ్ఞానమునందు జిక్కువడి జన్మల దొంతరలందు
మగ్గగా,
నేనొక బ్రహ్మనన్దలచు నేర్పరి ముక్తిని
పొందునిక్కమౌ

తా॥ అజ్ఞానంలో చిక్కుకొన్న తెలివితక్కువవాడు తన మనస్సులోనేనొక 'మనుష్యుడ' ను అని నమ్ముచూ ఎన్నటికీ ముక్తిని పొందలేడు. వాడికి జన్మలు అనేకం కలుగుతాయి. వాటిలోనే మగ్గిపోతాడు. కానీ నేను బ్రహ్మను అని భావించేవాడు మాత్రం ఏ బంధములోను కట్టుబడక ముక్తి పొందుతాడు.



**శ్లో॥ ముక్తాభిమానీ ముక్తోహి బద్ధోబద్ధాభిమాన్యపి**
**40 కింవదన్తీతి సత్యేయం యామతి స్సాగతిర్భవేత్**

తే॥ ఎంచి తాను జీవన్ముక్తుడంచు దలచు
వాడుముక్తుడౌ, అటుగాక బద్ధుడనని
తలచు హీనుడు బద్ధుడౌ ధరణియందు
మతి అదెంతటిదైనదో గతియునంతె

తా॥ ఎవడైతే తను జీవించియున్నా ఏబంధాలూ లేని జీవన్ముక్తుడనని తలచి ఏ బంధములేనట్లుంటాడో వాడు ముక్తి పొందినవాడే అవుతాడు. అట్లా కాకుండా వీరంతా నావారే ఇవన్నీ నావే అని భావించే అల్పుడు మాత్రం ఈ భూమ్మీద రకరకాల బంధాలతో సతమతమవుతుంటాడు. బుద్ధిః కర్మానుసారిణే అన్నట్లు దౌర్భాగ్యుడైపోతాడు.

శ్లో॥ దుర్లభంత్రయమేవైతత్‌దైవానుగ్రహహైతుకమ్
41 మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః

చం॥ మనుజుని జన్మయున్ దొరికి మానవదేహపు
ప్రాప్తికష్టమౌ
తనకొక వేళ కల్గినను ధర్మముమోక్షపు బాట
నేర్వరున్
వినుము ముముక్షుడయ్యు గురుభిక్ష లభించుట
దుస్తరంబవున్
కనుగొన మూటినిన్, విధిగ గావలె దైవకృపా
తరంగముల్

తా॥ మోక్షం లభించటమంటే అంత తేలికయిన పనికాదు. ముందు మానవదేహం కావాలంటే నరజన్మరావాలి. ఒకవేళ కలిగినా ధర్మము మోక్షములయందు ఆసక్తి కలుగదు. ఒకవేళ అదీ కలిగినా ముముక్షువు కాలేడు. ఒకవేళ అయినా



మంచి గురువు యొక్క కృపాభిక్ష లభించదు. ఒకవేళ ఈమూడు లభించినా అతి ముఖ్యమైన దైవానుగ్రహం కావాలి. అప్పుడు.... మోక్షం.

శ్లో॥ నాహందేహోనచప్రాణో నేన్ద్రియాణి మనోనహి
42 సదా సాక్షిత్వ రూపత్వాచ్ఛివ ఏవాస్మి కేవలః

ఆ॥ కాను దేహమేను కాను ప్రాణంబును
కాను ఇంద్రియములు మనసుగాను
సాక్షినౌదు నేను సతతంబునీలోనె
శివుడనౌదు నిలిచి చింతలేక

తా॥ నేనెవరిని? నేను దేహాన్నికాను. నేను ప్రాణాన్నికూడ కాను. అలాగని ఇంద్రియములు కూడ కాను. నేను సాక్షీభూతుడయిన శివుణ్ణి. ఏవిధమైన వికార మమకారములు లేని నిస్సంగుడిని. నీలోనే ఉంటాను.



శ్లో॥ దేహ బుద్ధ్యాతు దాసోహం జీవబుద్ధ్యాత్వదంశకః
43 ఆత్మబుద్ధ్యాత్వమేవాహమితిమే నిశ్చలామతిః

ఆ॥ దేహబుద్ధిచేత దేవ! నీదాసుండ
జీవబుద్ధి అంశమవుదు నీకు
ఆత్మబుద్ధిచేత ఆ 'త్వమేవాహం'పు
నియత కలిగె నాకు నిశ్చయముగ

తా॥ ఓదేవదేవా! దేహబుద్ధి ఉన్నంతవరకు నేను నీభక్తుణ్ణి నీదాసుణ్ణి. అది పోయి జీవబుద్ధి నేను జీవుణ్ణి అని తలచినప్పటినుండి నేను నీ అంశవే అనుకుంటున్నాను. అదికూడపోయి నిశ్చయంగా ఆత్మబుద్ధి కలిగినప్పుడు నేను ఆత్మనని భావించినప్పుడు త్వమేవాహం అంటే నీవే నేను అనే భావిస్తాను.



శ్లో॥ గురవోబహవస్సంతి శిష్యవిత్తాపహారకాః
44 తమేకం దుర్లభంమన్యే శిష్యహృత్తాప హారకాః

తే॥ శిష్య విత్తాపహరణము జేయువారు
కలరు గురుస్వాములెందరో, కానిలేరు
వారి హృత్తాపహరణంబు గరపువారు
జ్ఞానమొసగెడి గురులబ్ధి జరుగుటెట్లు?

తా॥ గురువు కావాలంటే అంత తేలిక కాదు. శిష్యునికి జ్ఞానబోధచేసి హృదయంలోని తాపమునుపశమనం చేసే గురువు కావాలి. కానీ దొరికే గురువులు చాలామంది విత్తాపహరణంచేసేవారేకదా. అంటే నీధనమును పాడుచేసే మాయదారి గురువులేకదా!

శ్లో॥ శైశవే2భ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణామ్
45 వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్॥

తే॥ బాల్యమందున విద్యయు, వయసునందు
భోగములును, నివృత్తియు ముసలియైన
పిదప, యోగానదేహంబు వదలుటయును
రోగమెరుగరు రఘువంశలోకపరులు

తే॥ రఘువంశ చక్రవర్తులు బాల్యమందు విద్య నేర్చుకొనుచు, యౌవనకాలమున భోగించుచు, ముసలితనములో నివృత్తిమార్గము నవలంభించుచు ఆ తరువాత యోగమార్గమున శరీరమును త్యజింతురు. అంతియేకాని సామాన్యుల వలె రోగపీడితులై మరణించరు.

**శ్లో॥ క్షణం చిత్తం క్షణం విత్తం క్షణం జీవితమావయోః**
**46 యమస్య కరుణానాస్తి ధర్మస్యత్వరితాగతిః**

ఆ॥ క్షణమె జీవితంబు, క్షణకాలమే సిరి
యముడు నిర్దయుండు, మనసుక్షణము
లోన మార్పుజెందు, కాన ఈక్షణమునే
ధర్మకార్యదీక్షతనరవలెను



తా॥ ధర్మకార్యదీక్ష చేబట్టుటకు మీనమేషాలు లెక్కించుట తగదు. ఎందుకంటే జీవించు కాలమెంత? క్షణకాలమే. ధనవైభవములుండేదెంతకాలం? ఆ దీక్షణకాలమే పోనీ యమధర్మరాజు జాలికలవాడు. మనబాధలకు జాలిపడి శిక్షలు తగ్గిస్తాడనే అనుకుందామా అంటేకాదు. మనసు క్షణకాలంలో మార్పు చెందుతుంది. కాబట్టి తక్షణవే ధర్మమార్గమవలంభించుట మంచిది కదా!

**శ్లో॥ అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృదిదైవతమ్**
**47 ప్రతిమాస్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్॥**

ఆ॥ ద్విజులకగ్నితానె దేవుడు, మునులకు
ఆత్మదైవమగును, ఔను ప్రతిమ
మూఢమతికి దైవము, సమదర్శికి జూడ
అన్నిటను కలుగును ఆత్మరూపు



తా॥ బ్రాహ్మణులందరికీ అగ్నియే దైవము. ఆత్మ దర్శనము కలిగిన మునులకు ఆత్మయే దైవము, తెలివి తక్కువ వారికి రాతిబొమ్మే దైవము అయితే అన్ని ద్వంద్వాలను సమభావంతో చూసే సమదర్శికి అన్నిటియందును ఆత్మ దర్శనము కలుగును.

**శ్లో॥ యతిర్యస్యగృహే భుంక్తే తస్యభుంక్తే హరిస్స్వయమ్**
**48 హరిర్యస్య గృహే భుంక్తే తస్యభుంక్తే జగత్రయమ్॥**

ఆ॥ ప్రీతినెవని యింట యతితా భుజించునో
విష్ణువచటదిన్న విధమునవును
తృప్తి కలుగ హరికి దీర్చిముల్లోకాలు
జెందు తృప్తి పుణ్యమొందగలము

తా॥ ఎవని ఇంట యతిప్రీతితో భుజిస్తాడో శ్రీమహావిష్ణువు ఆ ఇంట్లో తిన్నవిధమున ఫలితము కలుగును. శ్రీహరికి ఎచ్చట తృప్తి కలుగుతుందో ముల్లోకాలకూ తృప్తి కలిగినంత పుణ్యము దక్కును.



**49 శ్లో॥**
**నధ్యాతం పదమీశ్వరస్య విధివత్సంసార విచ్ఛిత్తయే**
**స్వర్గద్వార కవాటపాటన పటుర్ధర్మోపినో పార్జితః**
**నారీపీనపయోధరోరుయుగళం స్వప్నేపినాలింగితం**
**మాతుః కేవలమేవ యౌవన ననచ్ఛేదేకుఠారావయమ్॥**

సీ॥ పరమేశ్వరుని కృపన్ పరముసాధించుట
ఉత్తమోత్తమమదియుజ్వలంబు
సత్కర్మములజేత స్వర్గమ్ము సాధించ
ఉత్తమగుణమది ఉన్నతంబు
ధర్మప్రకారము తనరగృహస్థుగా
మనుట నిగ్రహముతో మధ్యమంబు
పరుల పీడించుచూ బ్రతుకుట నిద్రకున్
ఆహారమునకదే అధమమగును

ఆ॥ వీరు తల్లికడుపు పీడగా జన్మించి
కడుపు భారమట్లు గడిపి బ్రతికి
వ్యర్థమైనరీతి పశుప్రాయులైవారు
బ్రతుకనేల అట్లు వ్యర్థము కద!

తా॥ ఆ పరమేశ్వరుని దయచేత మోక్షసాధనకు గడుపు బ్రతుకు ఉత్తమోత్తమము. సత్కర్మలచేత స్వర్గం సాధించాలని కర్మయోగిగా బ్రతుకు గడుపుట ఉత్తమము. ధర్మ ప్రకారము గృహస్థాశ్రమంలో నిగ్రహంతో జీవించుట మధ్యమమైన జీవితము కేవలం నిద్రాహారాలకోసం జీవిస్తూ తను జీవించుటకు ఇతరులను బాధించువాని జీవితం అధమమైనది అటువంటి దుర్మార్గులు తల్లికడుపు చేటుగా పుట్టి పశుప్రాయులై జీవించెదరు. అట్లు బ్రతుకుట వ్యర్థము కదా!

**శ్లో॥ వేదాన్తా నామనేక త్వాత్సంశయానాం బహుత్వతః**
**50 వేద్యస్యాప్యతి సూక్ష్మత్వాన్నజానాతి గురుంవినా॥**

తే॥ వివిధ వేదాంత చింతలు వెల్లివిరిసె
పెక్కు సందేహములు కల్గు విద్యయందు
తెలియదగినది సూక్ష్మమై తెలియరాదు
గురుని దయలేక బ్రహ్మను అరయలేరు.



తా॥ ఈ ప్రపంచంలో రకరకాలైన వేదాంత సిద్ధాంతాలు వెలుగు జూశాయి. ఇక విద్యనార్జించునప్పుడు పెక్కు సందేహాలు కలుగుతుంటాయి. తెలుసుకోదగిన ఆ బ్రహ్మవిద్య అతి సూక్ష్మమై విశదంగా తెలియరాదు. అందుకే గురుని అనుగ్రహం కావాలి. అదిలేక బ్రహ్మను తెలుసుకోవటం అంత తేలికగా అయ్యేపనికాదు.

**శ్లో॥ నిరక్షరస్యాపితుయస్యకుక్షౌ**
**51 బ్రహ్మైవచా2 భాతిస ఏవసాక్షరః**
**సర్వాక్షర స్యాపితుయస్యచిత్తే**
**బ్రహ్మైవనా2భాతిసవైనిరక్షరః**

ఉ॥
అక్షరమైనరాని నరుడైనను అక్షరుదెల్సినంతనే
అక్షరజ్ఞానియౌ వెలయు, ఆత్రపు కుక్షినినింపు విద్యలన్
అక్షయమైనరీతి తను అన్నిటినేర్చినవాడు మూర్ఖుడై
అక్షర శూన్యుడై పరమునందడు అక్షరుదెల్వడెన్నడున్



తా॥ మానవుడు చదువురానివాడైనా, నాశరహితుడైన పరబ్రహ్మను తెలుసుకోగానే విద్యాధికునివలె మారిపోతాడు. కేవలం పొట్టకూటికోసం నేర్చిన విద్యలు ఎడతెగకుండా నేర్చినా ఆ చదువరి తెలివిలేనివాడే అక్షరజ్ఞానంలేనివాడే. వాడు ఎన్నటికీ మోక్షం సాధించలేడు. బ్రహ్మను తెలుసుకోలేడు.

**శ్లో॥ విద్యాదివం ప్రకాశత్వాద విద్యారాత్రిరుచ్యతే**
**52 విద్యాభ్యాసే ప్రమాదోయస్సదివాస్వాప ఉచ్యతే॥**

తే॥ బ్రహ్మజ్ఞాన ప్రకాశమే పగలు, వాని
తెలియకుండుట అజ్ఞాన తిమిరమగును
బహు అజాగ్రత్త విద్యను బడయునపుడు
'పగటి నిద్ర'ని చెప్పుట భావ్యమగును



తా॥ బ్రహ్మజ్ఞాన ప్రకాశమే పగలు అనియు, బ్రహ్మను తెలుసుకొనలేని అజ్ఞానమే రాత్రి అనియు విద్య నేర్చునపుడు అజాగ్రత్తగా నుండుటయె 'పగటినిద్ర' అని చెప్పుట ఎంతో భావ్యమైన ఆలోచన.

**శ్లో॥ షడంగాది వేదో ముఖేశాస్త్ర విద్యా**
**53 కవిత్వాదిగద్యం సుపద్యంకరోతి**
**గురేరంఘ్రిపద్మేమనశ్చేన్నలగ్నం**
**తతఃకిం తతఃకిం తతఃకిం తతఃకిమ్**

చం॥ వరుసగ నాల్గువేదములు వల్లెను వేయుచు
వాటిఅంగముల్
నిరతము శాస్త్రముల్ చదివి నేర్చుట గద్యము
పద్యమేటికిన్
గురుచరణారవిందముల గొల్వని బుద్ధికి
ఏమికల్గురా
పరమున లాభమేమిటికి ప్రాప్తిలు నెయ్యది
ఏదిదక్కురా

తా॥ నాలుగు వేదములు, వేదాంగములు, ఆరుశాస్త్రములు నేర్చి గద్యపద్యములను చెప్పగలుగుట దేనికి? గురువుయొక్క పదపద్మములను గొలుచుట రాని బుద్ధికి ఏమిప్రాప్తిస్తుంది? పరలోకంలో వాడికి ఏలాభం చేకూరుతుంది? ఏమి దక్కుతుంది? ఏదీ దక్కదు.

**శ్లో॥ కర్తాకారయితాచైవ ప్రేరకశ్చానుమోదకః**
**54 పుణ్యకార్యేపాపకార్యేచత్వారస్సమభాగినః**

ఆ॥ చేయువాడుబూని చేయించువాడును
ప్రేరకుండు, జూచి మురియువాడు
పాపపుణ్యములను పాయక సమపాలు
పొందుచుందురెపుడు పుడమియందు

తా॥ ఈ ప్రపంచంలో ఏ కార్యమునైన చేయువాడు, చేయించువాడు, ఆపనిచేయమని ప్రేరేపించువాడు,



ఆ పని జరుగుట చూచి ఆనందించేవాడు అని నాలుగు రకాల వారుంటారు. వారు చేసే పాపకార్యంలోనైన పుణ్యకార్యంలోనైన ఆ నలుగురు సమానభాగం పుచ్చుకుంటారు.

**శ్లో॥ వాసనాద్వివిధాప్రోక్తా శుద్ధాచమలినాతథా**
**55 మలినా జన్మహేతుస్స్యాచ్ఛుద్ధాజన్మవినాశినీ॥**

ఆ॥ రెండు విధములనగ నుండువాసనలిలన్
తెలియ శుద్ధమొకటి మలినమొకటి
మోక్షకారణంబు మొదటిది, జన్మల
లెక్కలేక నిచ్చు రెండవదియు.

తా॥ జీవికి వాసనలు రెండు విధములుగా నుంటాయి. శుద్ధమైన దొకటయితే మలినమైనది రెండవరకం. ఆ మొదటిది వాసనమోక్ష ప్రాప్తిని కలుగజేస్తె, రెండవది లెక్కలేనన్ని జన్మలను కలిగించి బంధాలలో కట్టివేస్తుంది.



**శ్లో॥ యథాకాష్ఠమయోహస్తీ యథాచర్మమయోమృగః**
**56 యశ్చవిప్రో2నధీ యానః త్రయన్తేనామ బిభ్రతి॥**

ఆ॥ కొయ్య ఏనుగైన కూడునదేముండు?
తోలుమృగమువల్ల కలుగునేమి?
పండితుండుగాక బ్రాహ్మణుండేలరా?
పేరుకొరకుగాక ఒరుగునేమి?

తా॥ నిజమై ఏనుగువల్ల ఉపయోగముంటుంది కాని, కొయ్యతో చేసిన బొమ్మ ఏనుగువల్ల ఏం లాభముంటుంది? తోలుతో చేసిన బొమ్మ మృగము వలన కూడ ఏ లాభమూ ఉండదు. అదేవిధంగా బ్రాహ్మణుడి ఆకారంలో ఉన్న మనిషి పండితుడు అయితే సంఘానికి ఉపయోగం కాని కేవలం బ్రాహ్మణ కులంలో పుట్టినందువల్ల ఏంలాభం?



**శ్లో॥ జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః**
**57 నరాణాం క్షీణపాపానాం కృష్ణేభక్తిః ప్రజాయతే॥**

తే॥ వేయిజన్మల జేసిన విలువకలుగు
తపము ధ్యాన సమాధుల తగిలియుంట
వసుధ క్షీణించు పాపాలవలన ప్రజకు
భక్తి, ఆసక్తి కృష్ణునిపైన కలుగు

తా॥ అనేక జన్మలలో చేసిన మంచి తపస్సు, ధ్యానము, సమాధుల వలన ఆయా జన్మలలో చేసిన పాపములన్నీ క్షీణించి మానవునికి శ్రీకృష్ణ పరమాత్మపై ఆసక్తి కలిగి అదే భక్తిగా మారుతుంది. లేకపోతే ఎన్నిసార్లు కృష్ణుని విగ్రహం చూసినా శిల్పం బాగుందనుకుంటాడు. అంతే.

**శ్లో॥ కోటరాంతర్భవో వహ్నిస్తరుమేకందహిష్యతి**
**58 కుపుత్రస్తుకులే జాతః స్వకులంనాశయేత్పరమ్॥**

ఆ॥ చెట్టుతొఱ్ఱయందు పుట్టినన్ చిరునిప్పు
కాలవెట్టుచెట్టు కానిసుతుడు
వంశమందుపుట్టి పాపియై చెలరేగి
కాల్చువంశమెల్ల కాలు కులము.

తా॥ ఒకచెట్టు తొఱ్ఱలో చిన్ననిప్పు (దావాగ్ని) పుట్టి ఆచెట్టుని మాత్రమే కాలుస్తుంది. కానిదుర్మార్గుడైన పుత్రుడు జన్మిస్తె వాడు కేవలం తనవంశాన్నేకాదు మొత్తం కులానికే చేటు తెస్తాడు.

**శ్లో॥ మన్త్రహీనంక్రియాహీనం భక్తిహీనం సురేశ్వర**
**59 యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుమే॥**



ఆ॥ నాదు పూజలందు ఓదేవ! కొరవడి
మంత్రహీనమైన, భక్తిహీన
మైన, క్రియయు హీనమైనను పరిపూర్ణ
తీయుమయ్య! క్షమను ఇమ్ముదేవ!

తా॥ ఓ సర్వేశ్వరా! నేను చేయుచున్న పూజలలో మంత్రము సరిగాలేకపోయినా, నాభక్తికొంత కొరతయినా, నేను చేయుపూజా విధానంలో కొంతలోపంఉన్నా, నన్ను దయతో క్షమించి నాపూజలోని లోపం మన్నించి దానికి పరిపూర్ణత నిచ్చి నన్ను కరుణించవయ్యా!

**శ్లో॥ జన్మనా జాయతేశూద్రః కర్మణాజాయతేద్విజః**
**60 వేద పాఠాత్తు విప్రస్స్యాత్ బ్రహ్మజ్ఞానాత్తు బ్రాహ్మణః**



ఆ॥ జగతియెవ్వడేని జన్మచే శూద్రుండు
కర్మలెల్ల బూనిగరప ద్విజుడు
వేదపఠనచేత విప్రుడౌ, సద్భక్తి
బ్రహ్మనెరిగినంత బ్రాహ్మణుండగు.

తా॥ కేవలం బ్రాహ్మణ కులంలో పుట్టినంత మాత్రాన బ్రాహ్మణుడవడు. పుట్టుకవల్ల ప్రతిమనిషీ శూద్రుడే. అనుష్ఠానం, సంధ్యావందనం మొదలైన కర్మలు చేయుటచేత ద్విజుడవుతాడు. వేదపారాయణ చేయుటచేత విప్రుడవుతాడు. సద్భక్తితో బ్రహ్మజ్ఞానము నెరిగిన తరువాత మాత్రమే బ్రాహ్మణుడు అనిపించుకుంటాడు.

**శ్లో॥ యథా చతుర్భిః కనకం పరీక్షతే**
**61 నిఘర్షణ చ్ఛేదన తాపతాడనైః**
**తథా నరాణాం పురుషః పరీక్ష్యతే**
**గుణేన శీలేన కులేన కర్మణా॥**



సీ॥ బంగారమైనను పనివాడు సుత్తితో
బూనిగొట్టుచు దాని సానబట్టు
కోయు అంపముతోటి కొరివిలోగాల్చును
తాబరీక్షించంగదాని వన్నె
బ్రహ్మవిద్యను గోరువారిని గురువులు
జరిపి పరీక్షల నెరుగ గలరు
సత్త్వాదిగుణములు, సాంప్రదాయము, పుణ్య
శీలత, పనులనుచేయు విధము

తే॥ గాంచినేర్తురు శిష్యుల కలుగుశ్రద్ధ
ఆదరింతురు శిష్యుల నాక్రమమున
విద్యనేర్పుటయే గాక వివరమిచ్చి
బ్రహ్మజ్ఞానము నిత్తురు వారి కపుడు

తా॥ స్వర్ణకారునికి మనం నగలు చేయమని ఇస్తె అయ్యో బంగారంకదా అని దానిని అబ్బురంగా చూడదు. దానిని కొలిమిలో కాలుస్తాడు. సుత్తిదెబ్బలు వేసి

వంకరలు సరిజేస్తాడు. అంపంతో కోస్తాడు. ఇవన్నీ దానిని పాడు చేయటం కోసం కాదు. దానివన్నె తెలుసుకోవటం కోసం చేస్తాడు. అదేవిధంగా బ్రహ్మవిద్య బోధించమని ఒక సద్గురువునాశ్రయిస్తే ఆయన అనేక విధములుగా శిష్యుని సత్త్వగుణము, సాంప్రదాయము, శీలము, ఆతని కర్మాను ష్ఠానమును పరీక్షించి ఆశిష్యునికి గల శ్రద్ధను చూచి ఆ తరువాత వానిని శిష్యునిగా స్వీకరించి బ్రహ్మ విద్యను ప్రసాదిస్తారు.

**శ్లో॥ పుష్పేగంధం తిలే తైలం కాష్ఠే2 గ్నింపయసిఘృతం**
**62 ఇక్షౌగుడం తథా దేహేపశ్యాత్మానం వివేకతః**

ఆ॥ పూలయందు తావి తిలలోన తైలంబు
చితుకులందు నిప్పు చెఱకుదీపి
పాలవెన్నవోలె పరమాత్మ తానుండు
దేహమందు జ్ఞానదీపమట్లు



తా॥ పరమాత్మ మానవుల దేహాలలో చైతన్య రూపుడై ఉంటాడు. జ్ఞానజ్యోతివలె ఉంటాడు. ఆ జ్యోతి పూలలోని వాసనవలెను, నువ్వులలోని నూనెవలెను, కట్టెపుల్లలోని అగ్నివలెను, చెఱకుగడలోని బెల్లమువలెను, పాలలోని వెన్నవలెను ఉన్నా కనిపించకుండా ఉంటాడు.

**శ్లో॥ క్షీరం క్షీరే యథాక్షిప్తం తైలం తైలే జలంజలే**
**63 సంయుక్తమేకతాం యాతి తథా2 త్మన్యాత్మ విన్మునిః**

ఆ॥ పాలలోన పాలు తైలాన తైలంబు
జలమునందు జలము కలిసినట్లు
ఆత్మవేత్తమునియు ఐక్యమౌ పరమాత్మ
యందు, మోక్షపదమునందు దాన

తా॥ ఆత్మను తెలుసుకున్న యోగిపుంగవుడు మోక్షము పొందుటకు పరమాత్మలో ఐక్యమవుతాడు. ఆ



ఐక్యమయ్యే విధమెలా ఉంటుందంటే పాలలో పాలు, నూనెలో నూనె, నీటిలో నీరు కలిసినట్లు అంతా ఒకటే అన్నట్లు ఉంటుంది.

శ్లో॥ పూర్వజన్మార్జితం కర్మవ్యాధి రూపేణ జాయతే
64 తచ్ఛాన్తిరౌషధైర్దానైర్జపహోమార్చనాదిభిః

ఆ॥ పూర్వజన్మకర్మ పొడచూపు రోగమై
బాధవెట్టు, గానిపట్టుబట్టి
హోమ జపము దాన ఓషధి సేవచే
ఉపశమించు కొంత తాపమైన

తా॥ మానవుడు గత జన్మల నార్జించిన పాపమె వానిని ఈ జన్మలో బాధిస్తుంది. కానీ పట్టుదలతో తగిన హోమములు, జపములు, దానములు చేసి తగిన ఔషధములను స్వీకరించిన ఆ రోగంయొక్క తీవ్రత కొంత తగ్గుతుంది.



**65 శ్లో॥**

**భోగే రోగభయం కులేచ్యుతి భయం విత్తేనృపాలార్భయం**
**మానే దైన్యభయం బలేరిపుభయం రూపే జరాయాభయం**
**శాస్త్రేవాది భయం గుణేఖల భయం కాయేకృతాన్తార్భయం**
**సర్వం వస్తుభయాన్వితం భువినృణాం వైరాగ్యమేవాభయం**

సీ॥ కులభ్రష్టుడౌ భీతి కులశేఖరుని కుందు
రోగభయంబుడు భోగికెపుడు
దొంగల రాజులతో భీతిధనమున్న
దీనత్వభీతియౌ మానమునకు
బలవంతునకు వైరి భయముండు, సుగుణుల
కుందు దుర్మతులచేమెండు భీతి
భూమికోసము భీతి భువిలోని నరులకు
అందగానికి వృద్ధుడౌట భయము
వాదనశాస్త్రికి భయము, రోగికి చావు
భయముండు, ఖలుడన్న భయము గుణికి

తే॥ భయములేనివాడుండునా వసుధయందు
ఉండు నెవ్వడో యాతడే ఉత్తముండు
కలిగి వైరాగ్య భావన నిలుచువాడు
భీతి నెరుగడు ముక్తుడౌ భీతినుండి

తా॥ గొప్ప కులమున జన్మించిన వానికి తను కులభ్రష్టుడనవు తానేమో అనే భయం ఉంటుంది. సుఖించేవాడికి రోగమొస్తుందనే భయం ఉంటుంది. ధనమున్నవానికి దొంగల భయమూ, రాజుగారు పన్నుల రూపేణా గుంజుకుపోతారనే భయం ఉంటుంది. గౌరవముండేవానికి అవమానింప బడతానేమో అనే భయం ఉంటుంది. బలవంతుడికి తనకన్న బలమైన శత్రువు భయం ఉంటుంది. సుగుణములు గలవారికి చెడ్డగుణం కలవారి భయం ఉంటుంది. భూమిపై నివసించే మానవులకు ఆ భూమికోసం పాట్లు పడుతూ దాని కోసం భయముంటుంది. పండితుడికి వాదించుటలో



భయముండును. రోగికి చావంటే భయంకదా! మంచివాడికి దుర్మార్గుడంటే భయం ఉంటుంది. మరి భయం లేనివాడు ఈ ప్రపంచంలో ఉంటాడా? ఎవడుంటాడో వాడు ఉత్తముడు. వైరాగ్య భావంలో ఉండే అతడు భయమునెరుగని ముక్తుడు.

**శ్లో॥ శ్రూయతాం ధర్మసర్వస్వం శ్రుత్వా చాప్యవధార్యతాం**
**66 ఆత్మనః ప్రతికూలాని పరేషాం నసమా చరేత్॥**

ఆ॥ ఎగిరి ధర్మమెల్ల గురుల శాస్త్రములచే
దానినాచరింపదగును నరులు
ఇతరులేది జేయు హితవు నీకది కాదొ
నీవు వారి కటులనెరపరాదు.

తా॥ ధర్మమునంతయూ సద్గురువులవల్లను, శాస్త్రముల వల్లను బాగుగా తెలుసుకొని నరులు దానినాచరించ వలెను. నీకు ఇతరులేమిచేస్తే బాధ కలుగుతుందో నువ్వు వారికది చేయగూడదు.



**శ్లో॥ పథ్యమౌషధసేవా చక్రియతేయేనరోగిణా**
**67 ఆరోగ్యసిద్ధిర్దృష్టా2స్యనాన్యామష్ఠిత కర్మణా॥**

తే॥ వ్యాధిగలరోగి సేవించి ఔషధంబు
పథ్యమును జేయతగ్గును వ్యాధి, కాని
అతని బంధువుసేవింప ఔషధమును
పథ్యమును బూని, తగ్గునా వ్యాధి యెపుడు?

తా॥ వ్యాధికలిగిన రోగి వైద్యుడు నిర్దేశించినట్లు పథ్యము జేయుచు ఔషధము చెప్పిన విధంగా సేవించిన వ్యాధి తగ్గును, కానీ వాని బంధువులెవ్వరో పథ్యం చేసి ఔషధం సేవిస్తే వ్యాధి తగ్గుతుందా.

**శ్లో॥ అజ్ఞానాద్భాసతే సర్వంత్వయిరజ్జౌభుజంగవత్**
**68 ప్రజ్ఞానాల్లీయతే సర్వం త్వయిరజ్జౌ భుజంగవత్॥**



తే॥ కలుగ నజ్ఞాన గాఢాంధకారమెంతో
త్రాడు సర్పంబనే భ్రాంతి నడగు నరుడు
జ్ఞానమెరిగి తొలగును గాన భ్రాంతి
సర్పరజ్జుల భేదంబు సరిగ తెలియు

తా॥ అజ్ఞానమనే గొప్ప చీకటి ఆవహించి యుండుటచేత మానవుడు త్రాటిని సర్పమనే భ్రాంతి చెందును. జ్ఞానమువలన సత్యము తెలుసుకొనుటచేత భ్రాంతి తొలగి సర్పమును త్రాడు అనుకోకుండా భేదమెరిగి ప్రవర్తించును.

**శ్లో॥ ఆస్థాస్వాస్థా యది స్యాతాంమేధోయాసప్రయోజనం**
**69 తేఉభేయదినస్యాతాంమేధయాకింప్రయోజనం॥**

ఆ॥ మేధమితమదైన మించిన శ్రద్ధచే
మేలు జరుగు,నట్లె కలుగు ఫలము
శ్రద్ధలేని మేధ సాధించదేదియున్
ఏమిలాభముండు నెవరికైన

తా॥ ఎవనికైనా మేధస్సు తక్కువగా నున్నా మంచి శ్రద్ధచేత కష్టపడి ఆలోటు తొలగించుకొని మంచి ఫలితం సాధించగలడు. కానీ శ్రద్ధలేనివాడు గొప్ప మేధావియైనా మంచి ఫలితం సాధించలేడు. అటువంటి వానివల్ల ఎవరికి మాత్రం ప్రయోజనం కలుగుతుంది?

**70 శ్లో॥**

**యావన్నాశ్రయతే దుఃఖం యావన్నాయాంతి చాపదః**
**యావన్నేంద్రియవైకల్యం తావచ్ఛ్రేయస్సమభ్యసేత్**
**యాపత్తిష్ఠతిదేహోఽయం తావత్తత్వం సమభ్యసేత్**
**సందీప్తేకోణభవనేకూపం ఖనతి దుర్మతిః**

సీ॥ ఎంతవరకు తాను ఎరుగడో దుఃఖంబు
ఆపదెంతవరకు దాపురాదొ
ఇంద్రియ వికలత్వమెందాక విరువదొ
వృద్ధాప్యమెందాక వెతలనీదొ



అందాక మాత్రమే ఆత్మశ్రేయస్సును
అరయగలడు నరుండట్లుగాక
యౌవనంబంతయున్ వ్యర్థంబుగావించి
కండ్లు తెరువకుండ గడిపి బ్రతికు

ఆ॥ చివరి క్షణమునందు చింతించవచ్చును
హరినియనుట తగదు జరుగదట్లు
ఇల్లు కాలుచుండ 'ఇక బావి త్రవ్వెద'
అనెడి మూఢమతిని అందునేమి?

తా॥ మానవునికి ఎంతవరకు దుఃఖం ప్రాప్తించదో, ఎంతవరకు ఆపద దాపురించదో, ఎంతవరకు అంగవైకల్యం రాదో, ఎందాక వృద్ధాప్యం చేరువ కాదో అంతవరకు మాత్రమే తనశ్రేయస్సు తను చూచుకోగలడు. యౌవనమంతా కండ్లకు పొరలు క్రమ్మినట్లు బ్రతికి వ్యర్థం చేసుకుని, చివరి క్షణంలో శ్రీహరిని తలుచుకుంటే మోక్షం వస్తుందిలే



అనుకుంటే పొరబాటు. అట్లా జరుగదు. ఇల్లు కాలిపోతుంటే ఆర్పటానికి నీళ్ళకోసం అప్పుడు బావి త్రవ్వుతాననే తెలివిలేనివాడిని ఏమనగలను?

**శ్లో॥ రత్యంతరేమూత్రపురీషయోర్వా**
**71 చండాలవేశ్మన్యథవా శ్మశానే**
**కృతప్రయత్నోఽప్యకృత ప్రయత్నః**
**సదా స్మరేత్ కేశవ నామధేయమ్॥**

చం॥ నెరుపుచు కామక్రీడలను నిత్యము, స్నానము
సంధ్యవార్చుచున్
అరుగుచు దీర్ఘ శంకకును, అల్పపు శంకకు,
మృత్యుభూమికిన్
తిరుగుచు మాలపల్లెలను దెల్వక
శౌచమశౌచమైననున్
నిరతము కేశవస్మరణ నెమ్మది జేయుట
మేలుయేరికిన్



తా॥ కేశవ నామస్మరణ ఎప్పుడు చేయాలి? ఎప్పుడు కూడదు? మనస్సు లగ్నం చేస్తే ఎప్పుడైనా చేయవచ్చు అంటున్నారు. రతి చేస్తున్నా, స్నానం చేస్తున్నా, సంధ్యలు వారుస్తున్నా, మలమూత్రములను విసర్జించుచున్నా, శ్మశానభూమిలోనైన, మాలపల్లెలలో నివసించుచున్నా, శుచిగానున్నా, అశుచిగానున్నా, ఏ పరిస్థితులలోనైనా శ్రీహరిని స్మరించవచ్చును.

**శ్లో॥ యుక్తియుక్తముపాదేయంవచనం బాలకాదపి**
**72 అన్యత్తృణమివత్యాజ్యమప్యుక్తం పద్మజన్మనా॥**

ఆ॥ యుక్తియుక్తమైన ఒక బాలకునిమాట
తప్పుకాదు వినుట తగును సుమ్మి!
మంచికాక బ్రహ్మమాటైన తృణమట్లు
విడువదగును మేటి విధము అదియె

తా॥ చక్కగా తగినదట్టైనచో ఒక బాలునిమాటను కూడ గౌరవించి వినదగును. అట్లు వినుట తప్పుకాదు. కాని మంచిమాటకాకపోతే బ్రహ్మచెప్పిన మాటనైన గడ్డిపోచవలె తిరస్కరించవచ్చు. అది మంచి పద్ధతే. అందులో ఏ తప్పులేదు.

**శ్లో॥ అశనేవసనే చైవశయనేభవనేతథా**
**73 దృష్టిర్యస్యనవిప్యేత ముక్తో2సావిజితేన్ద్రియః॥**

తే॥ తినెడి తిండియు, వస్త్రంబు, మనెడితావు
నిదుర బోయెడి స్థలమది ఏది అయిన
బాగులేదన్న చింత ఆవంత యైన
లేనివాడె జీవన్ముక్తుడనగనొప్పు.

తా॥ తను తినే ఆహారము, కట్టుకునే బట్ట, ఉండేచోటు, నిదురబోవు స్థలము ఏదయినా కాని బాగులేదని విచారం ఏమాత్రమూ పొందడో వానిని జీవన్ముక్తుడంటారు. జీవించియుండగనే ముక్తుడని భావము.



**శ్లో॥ కర్పూరేవీయమానేకింకాఠిన్యం తత్రవిద్యతే**
**74 అహంకారక్షయేతద్వద్దేహేకఠినతాకుతః॥**

ఆ॥ కప్పురంబువెలుగునప్పుడు సుంతైన
కఠినరూపులేక కాలునెల్ల
అట్లె అంతమై అహంకారమెల్లను
దేహియందు కాలి అహము బోవు

తా॥ కర్పూరంలో ఏమాత్రం మలినం లేకుండా ఉంటే నిప్పు తగలకానే అంటుకుని పూర్తిగా కాలిపోయి గట్టి పదార్ధమంత కరిగిపోతుంది. అట్లే అహంకారమంతా ఆవిరైపోయిన దేహిలో అహమంతా నశించి ఏమీలేకుండా పోతుంది.

**శ్లో॥ స్వధర్మాచరణం శక్త్యావిధర్మాచ్ఛనివర్తనమ్**
**75 దైవాల్లబ్ధేనసంతోష ఆత్మవిచ్ఛరణార్చనమ్**



చం॥ తలచుచు ధర్మమున్ తను అధర్మపు త్రోవను బోకనిత్యమున్
కలుగగ తృప్తియున్ దురిత కార్యములన్విడనాడి చేయుచున్
విలువగు బ్రహ్మనిష్ఠులగు వేత్తల సేవలు ఎంత సాధ్యమో
సలుపుచు అంతదాకతను సాయము చేయుచునుండ మేలగున్

తా॥ ఈ ప్రపంచంలో ఆర్భాటంగా దానాలు, యజ్ఞాలు చేయనక్కరలేదు. ధర్మచింతనతో అధర్మం విడనాడి, సదా తృప్తితో జీవిస్తూ, చెడ్డపనులు చేయకుండా, శ్రేష్ఠమైన బ్రహ్మజ్ఞానం కల మహాత్ముల సేవచేస్తూ ఎంత సాధ్యమైతే అంత పరోపకారం చేస్తూ ఉంటే చాలు.

**76 శ్లో॥**
**శ్లోకార్ధేనప్రవక్ష్యామియదుక్తం గ్రన్థకోటిభిః**
**దయాసమం నాస్తిపుణ్యం పాపం హింసాసమం నహి॥**



తే॥ అర్ధశ్లోకంబుతో కోటి అర్థములను
తెలుపు వేదసారంబును దెలియజేతు
భూతదయతో సమంబైన పుణ్యమున్ను
ప్రాణిపీడనకన్న పాపంబులేవు

తా॥ కోటి అర్థములున్న విషయమును సగంశ్లోకంలో చెప్తాను. వేదములయొక్క సారం అదే సుమా! భూతదయను మించిన పుణ్యంలేదు. అన్యప్రాణులను పీడించుటకంటే పాపంలేదు.

**77 శ్లో॥ అహింసాపరమోధర్మ స్స్వధర్మః ప్రాణినాం వధః**

**ద్విపద: పరమధర్మమహింస ప్రజలార వినుడు**
**ధర హింసవంటి అధర్మంబు లేదు.**

తా॥ ఓ జనులార! వినుడు. అహింసయే అత్యుత్తమమైన ధర్మము. అన్యప్రాణులను హింసించుటకన్న అధర్మంలేదు.

**శ్లో॥ సర్వశాస్త్రపురాణేషు వ్యాసస్యవచనంద్వయమ్**
**78 పరోపకారఃపుణ్యాయ పాపాయపరపీడనమ్॥**

తే॥ అన్ని శాస్త్రపురాణాల యందు రెండు
వాక్యములు ముఖ్యమని జెప్పెవ్యాసమౌని
పరులకుపకారమే పుణ్యమరయజగతి
పాపమే పరపీడన వలదు తగదు.

తా॥ అన్ని శాస్త్రములను పురాణములను వెలువరించి వ్యాసభగవానుడు చెప్పిన రెండు ముఖ్యమైన మాటలు ఆలకించుడు. పరులకు ఉపకారం చేయుటయే గొప్ప పుణ్యకార్యం. పరులను పీడించుటయే దుర్మార్గమైన పాపకార్యం. అదివద్దు. మంచిదికాదు.



**శ్లో॥ యోమే గర్భగతస్యాపివృత్తిం కల్పితవాన్ ప్రభుః**
**79 శేషవృత్తి విధానాయ సుప్తః కిమధవామృతమ్**

ఆ॥ మాతృగర్భమందు మసలెడి జీవికి
పోషకుండుయెవడు? పుడమియందు?
తనకు తానుతిండి తినలేని వానికి
దిక్కుదేవుడొకడె దిశలనెల్ల

తా॥ తల్లిగర్భంలో భ్రూణరూపంలో నున్న జీవికి ఆహారం ఇచ్చి పోషిస్తున్న దెవరు? ఈ ప్రపంచంలో తనకు తానుగా తిండి తినలేని వారికి (అవిటివారు, చెట్లు మొదలైనవి) తిండిపెట్టే ఆదిక్కెవ్వరనుకుంటున్నారు? దేవుడే సుమా!

**శ్లో॥ అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపివా**
**80 యస్మరేత్పుండరీకాక్షంసబాహ్యాభ్యంతరః శుచిః॥**



ఆ॥ తా పవిత్రుడైన, అపవిత్రుడైననున్
ఏ అవస్థనున్న, ఎచ్చటయిన,
బడయవలయునన్న బాహ్యాంతరపు శుద్ధి
పుండరీకనేత్రు బూని తలతు

తా॥ నేను పవిత్రుడైయున్ననూ లేక అపవిత్రుడై యున్నను ఎక్కడ ఉన్ననూ ఏ స్థితిలో ఉన్ననూ వెలుపల శరీరానికిగాని లోపల అంతరాత్మునికి గాని శుద్ధి కలుగుటకు పుండరీకాక్షుడైన ఆ శ్రీమన్నారాయణుని ధ్యానించెదను.

**శ్లో॥ పురాణమిత్యేవన సాధుసర్వంన చాపి కావ్యం**
**81 నవమిత్యవద్యం**
**సంతఃపరీక్ష్యాన్యతరద్భజన్తే మూఢఃపరం**
**ప్రత్యయనేయబుద్ధిః**



ఆ॥ పాతవన్ని మంచి పాడు కొత్తవియన్ని
అనుటతగదు, బుధులు అవనియందు
యెంచుకొందురెపుడు మంచిమార్గంబునే
పరుల మార్గమెంచు మందమతియు

తా॥ కొంతమంది పాతకాలం అంటే గతించినకాలమంతా మంచిదని, కొత్తకాలం అంటే నేటి కాలం అంతా చెడ్డదని మాట్లాడుతుంటారు. (కొంతమంది తద్విరుద్ధంగా కూడ మాట్లాడుతుంటారు) ఇది మంచిదికాదు. పండితులు, జ్ఞానులు కొత్తదయినా పాతదయినా మంచిమార్గాన్నే ఎంచుకుంటారు. ఇకపోతే మూర్ఖుడు మాత్రం పరులమార్గమే మంచిదని దానిని అనుసరిస్తాడు.

**శ్లో॥ అగ్నిగుండ సమానారీ ఘృతకుంభసమోనరః**
**82 సంసర్గేణ విలీయేత తస్మాత్తాం పరివర్జయేత్**

ఆ॥ అగ్గివంటిదతివ ఆజ్యంబు పురుషుడు
వేడి తగిలినేయి విధిగ కరుగు
పొంది స్త్రీని నరుడు బుద్ధిమంతుండయ్యు
మనసు చెడగతాను వ్యర్థుడగును

తా॥ స్త్రీ ఎప్పుడూ అగ్నివంటిది. పురుషుడు నేయివంటివాడు. వేడితగలనంతవరకు నెయ్యి గడ్డకట్టియుంటుంది. కాని వేడి తగలంగానే కరిగిపోతుంది. అదేవిధంగా స్త్రీ స్పర్శ తగులనంతవరకు బుద్ధిమంతుడు, స్థిరచిత్తునిగా నున్న పురుషుడు స్త్రీ పొందుకూడగానే మనసు చెడిపోయి పనికిమాలినవాడవుతాడు.



**శ్లో॥ ఆత్మబుద్ధి స్సుఖంచైవ గురుబుద్ధిర్విశేషతః**
**83 పరబుద్ధిర్వినాశాయ స్త్రీబుద్ధిః ప్రళయాంతకః**

తే॥ స్వంత బుద్ధితో నడచుట ఎంతొ సుఖము
పెద్దవారి బుద్ధియు ఎంతొ మేలుజేయు
పరులబుద్ధి వినాశంబు జరిపి తీరు
అయొ! ప్రళయాంతకంబురా అతివ బుద్ధి

తా॥ తనస్వంత బుద్ధినుపయోగించి ఏ కార్యమైన చేయువాని పద్ధతి సుఖకరము. అనుభవజ్ఞులైన పెద్దవారి మాట పాటించివారి బుద్ధికి తగ్గట్లు నడచుట ఎంతో మేలు చేస్తుంది. ఇతరులు చెప్పినట్లు బుద్ధిలేక ప్రవర్తిస్తే చాల చెడిపోతారు. ఇక స్త్రీ బుద్ధిప్రకారం స్వంత ఆలోచన లేకుండ చేస్తె ప్రళయాంతకమై సర్వనాశనమవుతుంది.

**శ్లో॥ దానం భోగ నాశస్తిస్రోగతయోభవన్తి విత్తస్య**
**84 యన్నదదాతినభుంక్తే తస్యతృతీయా గతిర్భవతి**



తే॥ అవనిధనవినియోగంబు త్రివిధములగు
అనుభవించుట, దానము, అపహరణము
అనుభవము, కీర్తి కలుగును అట్లుగాక
అపహరణ జెంది పరులచే అంతమగును.

తా॥ ప్రపంచంలో ధనవినియోగం మూడు రకములు. అనుభవించుట మొదటిది ఇహలోక సుఖాన్నిస్తుంది. దానం చేయుట రెండవది. దీనివల్ల పరము దక్కుతుంది. కీర్తివస్తుంది. ఇక మూడవది అపహరణం. దీనివల్ల దొంగలో దొరలో బాగుపడతారు. వీడికేమీరాదు.

**శ్లో॥ యధాపర్వతధాతూనాం దహ్యంతేధమనాన్మలాః**
**85 తథేన్ద్రియకృతాదోషాదహ్యంతే ప్రాణధారణాత్॥**

తే॥ పర్వతపు ధాతువులగల మలినములను
అగ్గి యేరీతిగా తాను బుగ్గిజేయు
అట్లె ఇంద్రియ కృతములౌ అఘములెల్ల
ప్రాణధారణ అనుఅగ్ని నణగిపోవు



తా॥ పర్వత ధాతువులయొక్క మాలిన్యములు అగ్ని (దావాగ్ని) చే దహింపబడును. అదే విధముగా ఇంద్రియ కృతములైన దోషములు ప్రాణాయామము అనెడి అగ్నిచే దహింపబడును.

**శ్లో॥ అంధవత్పశ్య రూపాని శబ్దం బధిరవచ్ఛృణు**
**86 కాష్టవత్పశ్యవై దేహం ప్రశాంతస్యేతి లక్షణమ్॥**

తే॥ అంధునివలె రూపంబులన్ అరయవలయు
బధిరువోలెను తగును శబ్దమ్ము వినుట
తనువు కట్టెయే అనురీతి తలచవలెను
ఇవియెరా ప్రశాంతుని తీరులవనియందు

తా॥ ప్రశాంతంగా ఉండాలని కోరుకునేవాడు, ఏ రూపమునైనా అంధుని వలె చూడవలెను. (అంటే చూడరాదని భావము), ఏ శబ్దమునైన చెవిటి వానివలె వినవలెను (వినరాదని భావము) శరీరం ఒకకట్టె, ఇది ఎప్పటికైనా కట్టెల్లో కాలాల్సిందే అన్నట్లుండాలి. అంటే కోర్కెలు లేకుండా ఉండాలి.

**శ్లో॥ అర్థాగృహేనివర్తంతే శ్మశానే మిత్ర బాంధవాః**
**87 సుకృతం దుష్కృతంచైవ గచ్ఛంత మనుగచ్ఛతి**

చం॥ ధనమది వెంటరాదు అది ద్వారము దాటదు నీకు
తోడవన్
పనివడి బంధు మిత్రులును వత్తురుగా మరుభూమి
దాకనే
వినుమిది పాపపుణ్యములు వీడక వచ్చును
తోడునీడయై
మనుజుని వెంబడించునవి మాన్యులు చెప్పిన
మాట సత్యమౌ

తా॥ మానవుడు చనిపోయాక వాడివెంట ఏమి వస్తుంది? ధనం వాడి ఇంటి ద్వారం దగ్గరనే ఆగిపోతుంది. బంధుమిత్రులు అది ఒక పని అన్నట్లుగా శ్మశానందాక వస్తారు. మరివాడి వెంట వచ్చేవి వాడు చేసిన పాపపుణ్యములే. వాటివల్ల నరకము, స్వరములు, తరువాత నీచ, ఉత్తమ జన్మలు కలుగుతాయి. ఇది పెద్దల మాట.



**శ్లో॥ త్యక్తసంగో జితక్రోధోలఘ్వాహరోజితేంద్రియః**
**88 పిధాయ బుద్ధ్యా ద్వారాణిమనోధ్యానే నివేశయేత్॥**

తే॥ తానసంగుడై, క్రోధమ్ము తరిమిగొట్టి
అణచి ఇంద్రియంబుల, మితాహారియౌచు,
బుద్ధిచే తొందిద్వారాలు మూసి, మనసు
నిలిపి పరమాత్మపై వాని కొలువ వలయు

తా॥ మానవుడు ఎలా జీవించాలంటే తను ఏమాత్రం సంగత్వం లేకుండా, కోపమును విడనాడి, ఇంద్రియములను నిగ్రహించి, మితముగా మాత్రమే ఆహారం తీసుకుంటూ, నవరంధ్రములు తొమ్మిది ద్వారములుగా ప్రపంచంతో మమేకం పొందాలనుకునే మనస్సుతో నుండక, మనస్సును నిగ్రహించి పరమాత్మనిపై నిలిపి వానిని పూజించవలెను.



**శ్లో॥ శైలూషో వేష సద్భావాభావయోశ్చ యధాపుమాన్**
**89 తథైవ బ్రహ్మవిచ్ఛ్రేష్ఠః సదాబ్రహ్మైవ నాపరః**

ఆ॥ నటుడు దాల్చినంత నారివేషంబును
దాల్చకున్ననైన తనుమగాడె
బ్రహ్మవేత్తయట్లె బడసినను ఉపాధి,
బడయకున్ననైన బ్రహ్మమగును

తా॥ రంగస్థలనడుడుతను పురుషుడిపాత్ర ధరించినా లేక స్త్రీపాత్ర ధరించినాతను మగవాడే కదా! అట్లే బ్రహ్మవేత్త తను ఉపాధిలో ఉండినా అనగా శరీర ధారణ చేసి యున్నా తన స్వస్వరూపమైన బ్రహ్మమే అగుచున్నాడు.

**శ్లో॥ అనుకూల కళత్రోయస్త స్వస్వర్గం ఇహైవహి**
**90 ప్రతికూల కళత్రస్య నరకోనాత్ర సంశయః**



తే॥ భార్య అనుకూలవతియైన పతికి ఇలయె
స్వర్గభాజనమై తీరు సలుపు నిష్ఠ,
భార్య ప్రతికూలవతియైన పతికి ఇల్లె
నరకమగు సంశయంబేల? ఘోరమగును

తా॥ తనభార్య తనకు అనుకూలవతియైన భర్తకు గృహమే స్వర్గసీమ. అతడు నిష్ఠతో తనకర్తవ్యం నెరవేర్చగలడు. భార్యప్రతికూలవతియైన భర్తకు ఇల్లే ఒక ఘోర నరకమైపోతుంది.

**శ్లో॥ ధర్మార్థ కామమోక్షాణాంయస్యైకో2పినవిద్యతే**
**91 అజాగళస్తనస్యేవ తస్య జన్మ నిరర్థకమ్**

ఆ॥ నాల్గు సాధనముల నయముగా యేదేని
గవయకున్న ఏది కలుగబోదు
మేక స్తనములట్లు మేలేమిజేయును
వ్యర్థమైన జన్మ వసుధయందు

తా॥ ధర్మార్థ కామమోక్షములను చతుర్విధ పురుషార్థములలో ఏదో ఒక్కటియైనా సాధించని వానికి ఏదీ ప్రాప్తించదు. మేకకు స్తనములవలె ఉండు భాగములనుంచి బొట్టుపాలురావు. ఆ స్తనములు దానికెట్లా నిరుపయోగమో. ఏ ఒక్క పురుషార్థమూ సాధించని వాని జన్మ ఈ ప్రపంచంలో అజాగళ స్తనంవలె వ్యర్థమే.

**శ్లో॥ అన్నదోషేణ చిత్తస్య కాలుష్యం సర్వదా భవేత్**
**92 కలుషీకృత చిత్తానా ధర్మస్సమ్యన్ నభాసతే॥**

తే॥ దోషముండిన ఆహార విషయమందు
కల్మషపుచిత్త మెప్పుడూ కలిగియుండు
కల్మషపు చిత్తమును తాను కలుగు వాడు
ధర్మ సూక్ష్మమౌ జ్ఞానంబు తానెరుగడు.



తా॥ తను తీసుకునే ఆహారంలో నియంత్రణ లేక దోషముండినచో ఆ మానవుని చిత్తం కూడా కలుషితమై వుంటుంది. తనకి కల్మషమైన చిత్తం ఉన్నవాడు ధర్మ సూక్ష్మత కలిగిన జ్ఞానము నార్జించలేడు.

**శ్లో॥ ఆహార నిద్రా భయమైథునంచ**
**93 సామాన్యమేతత్పశుభిర్నరాణాం**
**జ్ఞానం నరాణామధికం విశేషం**
**జ్ఞానేనహీనః పశుభిస్సమానః**

ఉ॥ తిండియు, నిద్రబోవుటయు, తీవ్రభయంబును
కామవాంఛలున్
ఉండు సమంబుగా నరున కుర్విమెకంబున
కేమి భేదమౌ
మెండగు జ్ఞానసంపద వివేకము కూడిన
యోగియై నరుం
దుండగ, జ్ఞాన హీనుదును ఒక్క మృగంబగు
దుష్టవర్తనన్



తా॥ ఆహారము, నిద్ర, భయము, సంభోగవాంఛయను ఈ నాలుగు విషయములలో పశువులకు మానవులకు కోర్కె సమానముగానే యుండును. జ్ఞాన సముపార్జనవల్ల వివేకము కలుగుట జేత నరుడు యోగియై ముక్తి పొందుతున్నాడు. జ్ఞానహీనుడైనవాడు మృగమువలె దుష్టుడై జీవిస్తాడు.

**శ్లో॥ విషస్య విషయాణాంచ దూరమత్యంత మాంతరం**
**94 ఉపభుజ్య విషంహంతి విషయాస్మరణాదపి**

ఆ॥ విషము బేధమౌను విషయంబు కన్నను
మింటి దూరముండె రెంటినడుమ
తిన్న జంపు విషము, ఉన్న మనంబున
చాలు విషయవాంఛ చంపునరుని



తా॥ విషము, విషయము (విషయవాంఛ) ఒకే విధముగా ధ్వనించినను రెంటి నడుమ గగనమంత దూరం ఉంది. అనగా వ్యత్యాసం ఉన్నది. విషము తింటే చంపుతుంది, మనస్సులో విషం తినాలని అనుకున్నంతమాత్రాన చంపదు. కానీ విషయవాంఛ అనుకున్నంత మాత్రాన అపకారం చేసి చంపుతుంది.

**శ్లో॥ ఉల్కాహస్తో యథాకశ్చిత్ ద్రవ్యమాలోక్యతాంత్యజేత్**
**95 జ్ఞానేన యమాలోక్య జ్ఞానంపశ్చాత్పరిత్యజేత్**

ఉ॥ చీకటి ఇంటిలో వెదుక చేత ధరించును
దీపమొక్కడున్
చేకొని కోరువస్తువును శీఘ్రమె వీడును
చేతి దీపమున్
చేకొని శాస్త్రజ్ఞానమును జ్ఞేయము నొందిన
బ్రహ్మజ్ఞానియున్
నాకిక ఏల శాస్త్రమని నమ్ముచు వీడును, బ్రహ్మ
గోరుచున్

తా॥ చీకటింట్లో ఏదన్నా వస్తువును వెదుకుటకు మానవుడు ఒక దీపమును చేత ధరించి వెదకి కావలసిన ఆ వస్తువును పట్టుకొని దీపమును విడిచి పెట్టును. అదేవిధంగా బ్రహ్మను తెలుసుకొనుటకు శాస్త్ర జ్ఞానం అవసరం కాబట్టి శాస్త్రములను చదివినా బ్రహ్మజ్ఞాని, ఒక్కసారి బ్రహ్మను తెలిశాక శాస్త్రజ్ఞానాన్ని వదిలివేస్తాడు.

**శ్లో॥ ఊర్ధ్వ బాహుర్వదామ్యేష నచకశ్చచ్ఛృణోతిమాం**
**96 ధర్మాధర్ధశ్చకామశ్చసధర్మః కింనసేవతే**

చం॥ నెరపిన ధర్మమున్ అదియె నీకు చతుర్విధ
పురుషార్ధముల్
గరపు, నధర్మవర్తనము కాల్చును పుణ్యము
రెండు చేతులున్
శిరసున జేర్చి మ్రొక్కెదను చెప్పెడి మాటల
నాలకింపుడీ
నరకము జేర్చు పాపమిక నమ్ముడిసీ!
ఒకడైన నన్నికన్



తా॥ నీవు ధర్మాన్ని నమ్మి, ధర్మమార్గాన్ననుసరిస్తె నీకు ధర్మార్ధ కామమోక్షములనే చతుర్విధ పురుషార్ధములు దక్కుతాయి. అధర్మముననుసరిస్తే అది నీ పుణ్యాన్నంతా దహించి వేస్తుంది. నా చేతులు శిరస్సునజేర్చి చెప్తున్నాను. నామాట నమ్మండి. పాపము నరకాన్నిస్తుంది. అయ్యో! నామాట ఒక్కడైనా నమ్మడే!

**శ్లో॥ వాసనాయాస్తథావహ్నౌ ఋణవ్యాధి ద్విషామపి**
**97 స్నేహ వైరవిషాణాం చశేషః స్వల్పో2పి బాధతే॥**

ఆ॥ అప్పు విషయవాంఛ, అగ్గియు, వ్యాధియున్
స్వజనప్రేమ, విషము, శత్రుశేష
మించుకైన మిగుల హితవౌనె? అట్లైన
వృద్ధిజెంది తిరిగి పెంచు వెతను



తా॥ అప్పు, విషయవాంఛ, నిప్పు, రోగము, స్వజనులపై మమకారం, విషము, శత్రుశేషము వీటిలో ఏదికూడ కొంచెం మిగిలిఉన్నా ప్రమాదమే. అట్లు మిగిలినచో మెల్లిగా వృద్ధిజెంది సర్వనాశనం చేసి దుఃఖాన్ని కలిగిస్తుంది.

**శ్లో॥ అజ్ఞాన సర్పదష్ట స్యబ్రహ్మ జ్ఞానౌషధం వినా**
**98 కిమువేదైశ్చ శాస్త్రైశ్చకిము మన్త్రైః కిమౌషధైః**

తే॥ అరయ నజ్ఞాన సర్పమ్ము కరచినంత
బ్రహ్మజ్ఞానౌషధమ్ము కావలయునవని
మంత్రవేద శాస్త్రమ్ముల వలనగాని
అన్యఔషదమ్ములగాని అవదు మేలు

తా॥ గమనించినచో అజ్ఞానమను సర్పము కాటువేసినచో బ్రహ్మ జ్ఞానమను ఔషధము కావలయును. అంతేకాని వేద, శాస్త్రపఠనము జేతగాని, మంత్రమువలన గాని, ఇతర ఔషధముల వలన గాని, ఏమాత్రమూ ప్రయోజనముండదు.



**శ్లో॥ ఔదుంబరాణి పుష్పాణి శ్వేతవర్ణంచ వాయసం**
**99 మత్స్యపాదం జలేపశ్యేన్ననారీ హృదయస్థితమ్**

ఆ॥ అత్తిపూలనైన, అతితెల్లకాకుల
నైన, చేపపాదమైనగాని
కాంచవచ్చునేమొ గాలించి వెదకిన
వనిత హృదయమరయ వేనికగును?

తా॥ తీవ్రంగా గాలించి వెదకితే అత్తిపూలను, తెల్లని కాకులను ఆఖరికి చేప పాదమునైనా చూడగలమేమో కాని, ఆడదాని హృదయం తెలుసుకోవటం ఎవరివల్లాకాదు.

**శ్లో॥ హస్తస్యభూషణందానం సత్యంకంఠస్యభూషణం**
**100 శ్రోతస్యభూషణం శాస్త్రం భూషణేకిం ప్రయోజనం॥**

ఆ॥ చెవికి భూషణంబు శ్రేష్ఠమౌ శాస్త్రంబు
చేతి భూషణంబు చేయు ఈవి
కంఠ భూషణమ్ము ఘనమైన సత్యమే
వేరు భూషణముల నరయనేల?

తా॥ చెవికి భూషణము కుండలములు కాదు. చక్కటి శాస్త్ర చర్చే భూషణము. చేతికి భూషణం ఆ చెయ్యి చేసేదానమే గాని కడియాలు ఉంగరాలు కావు. కంఠమునకు గొప్పసత్యవచనమే ఆభరణము గాని మణి హారములు కాదు. ఇతరములైన భూషణములతో పనేముంది?

**శ్లో॥ భవితవ్యంభవత్యేవ నారికేళ ఫలాంబువత్**
**101 గచ్ఛత్యేవహిగంతవ్యం గజభుక్తక పిత్థవత్**

తే॥ రాక తెలియక వచ్చును రాగలదియు
నారికేళపు నీటిలా అరయలేరు



పోగలిగినది తెలియకే 'పోవు' వీడి
గజము తిన్న వెలగపండు కరణినవని.

తా॥ ఏదన్నా విధివశాత్తు సంప్రాప్తించాలని ఉంటే అది తప్పకుండా కొబ్బరికాయలో నున్న నీరములా వచ్చేస్తుంది. అట్లా విధివశాత్తు అది పోవాలని ఉంటే ఏనుగు తిన్న వెలగపండు గుజ్జులా మాయమైపోతుంది.

**శ్లో॥ వాగ్వాదో2ర్థ సంబంధః పరేషాందార భాషణమ్**
**102 యత్రమిత్రత్త్వమిచ్ఛన్తితత్రత్రీణినకారయేత్॥**

ఆ॥ వాదులాట, ఒరుల భార్యతో మాటలు
ఇచ్చిపైకమున్ను పుచ్చుకొనుట
మేలుకాదు చెఱచు మిత్రత్వమెప్పుడున్
మూటి విడువవలయు మేటినరుడు.



తా॥ నేర్పరియైన నరుడు మూడు విషయములను త్యజించవలెను. మొదటిది పరులతో అనవసరంగా వాదులాటకు దిగటం రెండవది పరాయివారి భార్యలతో అనవసరమైన ప్రసంగం. మూడవది ధనమును అప్పు ఈయుట గాని తీసుకొనుటగాని చేయుట, ఈ మూడు పనులు మంచివి కావు. స్నేహాన్ని పాడుచేస్తాయి.

**శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్**
**103 అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥**

ఆ॥ హరికథలను వినుట, హరినామకీర్తన,
ధ్యాన, సేవ, పూజ, దండమున్ను,
హరికి దాస్య, స్నేహ, మాత్మనివేదన
నవ విధములనుండు నవనిభక్తి

తా॥ శ్రీమన్నారాయణుని తొమ్మిది విధములైన భక్తి తత్పరతతో అర్చించవచ్చును. అవి, హరికథల నాలకించుట, నారాయణుని నామసంకీర్తన



చేయుట, దామోదరుని ధ్యానించుట, శ్రీకాంతునిసేవించుట, పురుషోత్తముని పూజించుట, నళినీనాథునికి నమస్కరించుట, విశ్వాత్మునికి దాస్యము జేయుట, శేషశాయికి స్నేహము జూపుట, ఆదిదేవునకు ఆత్మ నివేదన జేయుట. వీనిని నవ విధభక్తులందురు.

**104 శ్లో॥**

**అదానదోషేణ భవేత్ దరిద్రః దారిద్ర్య దోషేణ కరోతిపాపం**
**పాపాదవశ్యం నరకం ప్రయాతి పునః దరిద్రఃపునరేవపాపీ॥**

ఉ॥ దానము చేయకుండుటచె తాను దరిద్రుని
వోలెబట్టున
ద్ధానిచె పైకముండక నిదానము పోవును
పాపియౌనున
ద్ధానిచె తానుబుట్టు గదధాత్రి దరిద్రుని వోలె
అందుచే
వానికి పాపమే మిగులు బాధల నొందును జన్మ
జన్మలన్

తా॥ దానగుణం లేని వాని అవస్థ చూడండి. దానం చేయనందువల్ల దరిద్రునిగా జన్మిస్తాడు. దానివల్ల ధనం ఉండదు. అందువల్ల యుక్తాయుక్త విచక్షణ పోగొట్టుకుంటాడు. దానివల్ల ఎన్నో పాపాలు చేసి పాపి అవుతాడు. దానివల్ల మళ్ళీ దరిద్రునిగానే భూలోకంలో జన్మిస్తాడు. మళ్ళీ పాపం చేస్తాడు ఈ విధంగా ఎన్ని జన్మలెత్తినా పాపిగానే జన్మిస్తాడు. అందుకని దానము తప్పక చేయాలి.

**శ్లో॥ ఉద్యమేనహిసిద్ధ్యన్తి కార్యాణినమనోరథైః**
**105 నహిసుప్తస్యసింహస్యప్రవిశంతిముఖేమృగాః**

ఆ॥ కలుగు యత్నమెంచ, కార్యంబదేదైన,
కోరుమాత్రముననె కూడదేది
తెగని నిద్రబోవు మృగరాజు నోటికి
మృగమేది చిక్కు మేతకొరకు



తా॥ ప్రయత్నము చేసినందువల్ల మాత్రమే. ఏ కార్యమైన సిద్ధిస్తుంది. ఆవని అయితే బాగుండు అని కోరుకున్నంత మాత్రాన ఏపనీ పొసగదు. సింహమైనా కష్టపడి వేటాడితే ఇతరమృగాలు ఆహారంగా దొరుకుతాయి గానీ ఏమృగం కూడా నన్ను తిను అని నోటి దగ్గరకురాదు కదా!

**శ్లో॥ అంగుష్ఠం బ్రహ్మమాత్రం చతర్జనీజీవ ఏవచ**
**106 తయోరైక్యం ప్రకుర్వీత జ్ఞానముద్రాప్రకీర్తితా॥**

ఆ॥ చేతి బొటనవ్రేలు శ్రేష్ఠుడు బ్రహ్మవన్
చూపువ్రేలు జీవుడై పరగును
కలిపి రెంటిజూపనిల జ్ఞానముద్రయై
ఐక్యమౌను రెండు అనుట దెలుపు

తా॥ పరమ విశిష్టమైన జ్ఞానముద్ర ఎలా ఉంటుందో వివరిస్తున్నారు. కుడిచేతి బొటనవ్రేలు బ్రహ్మమును సూచించును. చూపుడు వ్రేలు జీవుని సూచించును



చూపుడు వేలు ఒంగి బొటన వ్రేలుని వర్తులాకారముగా తాకుట స్థిరమైన బ్రహ్మను జీవుడు సాధనచే ఐక్యము చెందుట సూచించును. ఇదే యోగులు చూపు జ్ఞానముద్ర.

**107 శ్లో॥**
**విద్యా వివాదాయ ధనం మదాయ శక్తిః పరేషాం పరపీడనాయ**
**ఖలస్య సాధోర్విపరీత మేతత్ జ్ఞానాయ దానాయ చరక్షణాయ॥**

చం॥ చదువు వితండవాదనకు, సంపద గర్వము బెంచ, శక్తియున్
వదరుచు బాధపెట్టుటకు వాడును దుష్టుడు, సజ్జనుండిలన్
చదువును జ్ఞానబోధనకు, సంపద దాన మొసంగ, శక్తియున్
ముదముగ శిష్ట రక్షణకు మోదమొనర్పగ వాడుపూనికన్



తా॥ చదువు, సంపద, శక్తి(అధికారం) పూర్వజన్మ సుకృతం చేత కలుగుతాయి. అందువలన ఆ మూడూ సజ్జనుడికీ దక్కవచ్చు, దుష్టుడికీ దక్కవచ్చు. అవి దక్కితే ఎవరు ఎట్లా ప్రవర్తిస్తారో వివరిస్తున్నారు. చదువును వితండవాదనకు, సంపద గర్విష్టి అవటానికి, శక్తిని అవాకులు చెవాకులు పేలి (ఇష్టం వచ్చినట్లు మాట్లాడి, ప్రవర్తించి) ఇతరులను బాధించుటకు ఉపయోగిస్తాడు దుర్జనుడు. అదే సజ్జనుడైతే చదువును జ్ఞాన బోధనకు, సంపదను దానము చేయుటకును, శక్తిని మంచివారికి మేలు చేయటానికి వాడి కీర్తి పొందుతాడు.

**శ్లో॥ మలినోపి యథాదర్శో రూపాలోకస్య నక్షమః**
**108 తథా2 విపక్వకరణ ఆత్మజ్ఞానస్య నక్షమః॥**

ఆ॥ మురికి అద్దమందు నరయ బింబము కాదు
తన్నుదాను జూడ తరము కాదు
ఆత్మశుద్దిలేని అంతఃకరణ తోటి
ఆత్మజ్ఞానమరయ నలవికాదు.

తా॥ ఏ విధంగా మురికి పట్టిన అద్దంలో ప్రతిబింబం సరిగా చూచుట సాధ్యంకాదో అదేవిధంగా ఆత్మశుద్ధి లేని అంతఃకరణ ఉంటే ఆత్మజ్ఞానం కనుగొనుట సాధ్యం కానిపని.

**శ్లో॥ గంగాపాపం శశీతాపం దైన్యం కల్పతరుస్తథా**
**109 పాపం తాపంచ దైన్యంచ హంతిసజ్జన దర్శనం॥**

ఆ॥ గంగతానమాడ కల్గుపాపము వోవు
తాపమాపు చంద్ర దర్శనంబు
కల్పతరువు తీర్చు కలిమిచే దైన్యంబు
సుజనదర్శనంబు జూపునన్ని

తా॥ గంగలో స్నానం చేస్తే పాపములు మాత్రమే పోతాయి. చంద్రుని దర్శించిన తాపం మాత్రమే తగ్గుతుంది. కల్పవృక్షం లభిస్తె దీనావస్థ మాత్రమే పోతుంది. కాని సజ్జనుడైన వానిని ఆశ్రయిస్తే పైమూడు కలుగుతాయి.



**శ్లో॥ బ్రహ్మచారీ గృహీవా2పి వానప్రస్థో2థవా యతిః**
**110 నారీవావృషలోవా2లి పక్వో బ్రహ్మవిచారయేత్॥**

తే॥ బ్రహ్మచారియు, సంసారి, వానప్రస్థు
లైన, యతియైన, స్త్రీ, శూద్రులైన గాని
బుద్ధి పరిపవక్వమైనచో ఉత్తమగతి
చెలగి బ్రహ్మవిచారంబు జేయవచ్చు.

తా॥ బ్రహ్మచర్యంలోనున్నా, గృహస్థాశ్రమంలో ఉన్నా, వానప్రస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసియైనా, స్త్రీయైనా, శూద్రుడైనా బుద్ధి పరిపక్వత గలిగి మంచి మార్గములో ఉంటే చాలు బ్రహ్మవిచారణ చేయుటకు అర్హులే.

**శ్లో॥ గతేప్రాణేయథాదేహస్సుఖదుఃఖేనవిందతి**
**111 తథాచేత్రాణయుక్తోపి సకైవల్యాశ్రమే వసేత్॥**



తే॥ శ్వాసవోయిన దేహమ్ము శవమె గనుక
సుఖము దుఃఖంబులరయదు సుంతయైన
ప్రాణముండియు అవ్విధిబరగువాని
మనము జీవన్మృతుండని అనుట తగును

తా॥ శ్వాస ఆగిపోయిన దేహం శవమే కాబట్టి, కొంచెమైనా దానికి సుఖదుఃఖాలుండవు. అదేవిధంగా ప్రాణమున్నాకూడా దేహ, జీవ భావనలేని యోగిని జీవన్మృతుడని అంటారు.

**శ్లో॥ సలిలేసైంధవం యద్వత్ సామ్యం భవతి యోగతః**
**112 తదాత్మమనసోరైక్యం సమాధి రభిధీయతే॥**

ఆ॥ నీరమందు ఉప్పు కరిగి రూపము పోయి
తాను జలమె యౌను, ధ్యానమందు
అట్లె వీడిపోవునా మనోవృత్తులు
బ్రహ్మరూపుతాను బడయగలుగు.



తా॥ నీటిలో ఉప్పు కరిగిపోయి తన రూపాన్ని పోగొట్టుకున్నట్లే, యోగి ధ్యాన సమాధిలో మనోవృత్తులు అదృశ్యమైపోయి తనరూపం పోయి బ్రహ్మరూపం పొందుతాడు.

**శ్లో॥ కపిరపిచ కాపిశాయన మదమత్తోవృశ్చికేన సందష్టః**
**113 అపిచ పిశాచగ్రస్తః కింబ్రూమస్తస్యవైచిత్ర్యమ్॥**

చం॥ మనసొక కోతిరా, వినదు మాటను ఆపయి
కల్లు ద్రావెబో
వినుమిక దాని కుట్టె నొకవృచ్ఛికమెంతయొ
బాధ పెట్టగా
తననటు ఆవహించెనొక దయ్యము ఏమని
చెప్పవచ్చురా
తనకిక శాంతి అన్నదెటు దక్కును ఈశ్వరు
నెట్లు మ్రొక్కురా

తా॥ నరుని మనస్సు కోతివంటిది. కోతి చపలత్వానికి ప్రతిరూపం. దానికి నిలకడ ఉండదు, చెప్పినమాట, వినదు. కల్లు త్రాగింది. ఇక ఆ కోతికి తేలు కుట్టిందట, ఆపైన దయ్యం పట్టిందట. ఇక దానిగురించి ఏం చెప్పగలం. (అదే విధంగా మనస్సు కూడా ఒకకోతి. దానికి సహజంగానే చపలత్వం ఉంది. పైగా మదము అనే కల్లుతాగింది, అసూయ అనే తేలుకుట్టింది, అహంకారం అనే దయ్యం పట్టింది. అది ఇక మాట వింటుందా? వినదుగాక వినదు. మనశ్శాంతి ఎలాకలుగుతుంది. భగవద్ధ్యానం ఎలా చేస్తుంది? (భక్తియే చక్కటి మార్గం)

**114 శ్లో॥**

**అపూజ్యయత్రపూజ్యన్తే పూజ్యానాయాన్తి పూజ్యతాన్**
**తస్మిన్ సర్వంలయం యాన్తివిద్యాజ్ఞానంతపః కులమ్॥**

తే॥ ఎచట పూజ్యుల పూజ్యులై ఎరుగబడెద,
రెచట నీచులు పూజలనెల్లగొందు
రచట తపము, జ్ఞానము, విద్యయంత, కులము
సర్వనాశనమైతీరునుర్వియందు.



తా॥ ఎక్కడ పూజలనొందదగినవారు పూజింపబడక నీచులు పూజింపబడెదరో, అచట తపస్సు జ్ఞానము, విద్య మరియు కులము సర్వనాశనమై పోతాయి.

**శ్లో॥ కృతేప్రవర్తతే ధర్మం చతుష్పోదో జనాధృతః**
**115 సత్యం దయాతపోదానమితి పాదా విభోః నృప!॥**

సీ॥ సత్యమ్, దయ, తపము, సవ్యమౌ దానంబు
ధర్మని పదములై తనరుచుండు
నాల్గుపాదంబుల నయముగా ధర్మంబు
కృతయుగమందున సంచరించు
దయ తపంబులతోటి దానంబు మూడైన
త్రేతాయుగంబున అతని కాళ్ళు
తపము దానములని తెలిసిన ఆరెండు
కాళ్ళు ద్వాపరమున కలిగియుండె



ఆ॥ ఒంటికాలితోటి కుంటును కలియుగ
మందు, దానమొకటె ఆదుకొనును
ఎన్ని లక్షణంబులెవనికి యుండునో
ఆ యుగపురుషుడని అందురతని

తా॥ ధర్మం నాలుగు పాదములతోనడుస్తుందంటారే! ఎందుకు గోవురూపంలో ఉండే) ధర్మమునకు సత్యము, దయ, తపస్సు, దానము అని నాలుగు కాళ్ళున్నాయి. కృతయుగంలో ఆ నాలుగుపాదాల నడిచే ధర్మానికి త్రేతాయుగంలో దయ, తపసఊ, దానము అనే మూడు కాళ్ళే ఉంటాయి. ద్వాపరయుగంలో తపస్సు, దానము అనే రెండు కాళ్ళతో నడుస్తుంది ధర్మం. కలియుగంలో ఒక్కదానం అనే ఒంటికాలిపై నడుస్తుంది ధర్మం. ఎవరికి ఏఏ గుణాలుంటాయో వారిని ఆయుగపురుషుడంటారు.



**శ్లో॥ వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి**
**116 లోకోత్తరాణాం చేతాంసికోను విజ్ఞాతుమర్హతి॥**

తే॥ ఇల మహాత్ములందరు విధిసలుపువేళ
వజ్రకఠినులైయుందురు, ప్రాణికోటి
కీయ దుఃఖోపశమనము హితవుగరపి
మల్లెపూల మృదుత్వము వారికుండు

తా॥ ఈ ప్రపంచంలో మహానుభావులందరు తమ కర్తవ్యం నెరవేరుస్తున్నప్పుడు వజ్రంవలె కఠినమ్మైయుంటారు. ఇతర ప్రాణులకు దుఃఖోపశమనము కలిగించునప్పుడు మల్లెపూవుల వలె మృదులైన మనస్సు కలిగి యుంటారు.